SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్
D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి


తెలుగు దినపత్రిక

వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : ఆదివారం 20 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 211

# విశాఖలో ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19** :విశాఖపట్నంలో ఆయుర్వేద వైద్య కళాశాల ఏర్పాటును పరిశీలించవలసిందిగా శుక్రవారం రాజ్యసభలో వైస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు విజ్ఞప్తి చేశారు. హోమియోపతి సెంట్రల్ కౌన్సిల్, ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ సవరణ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో విజయ సాయి రెడ్డి మాట్లాడుతూ విజయవాడలో ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా కేంద్రం ఉన్నందున విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. నేషనల్ ఆయుష్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం దేశంలో 4200 ఆయుష్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించింది. అందులో భాగంగా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారో తెలపాలని ఆయన మంత్రిని కోరారు. అలాగే విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 50 పడకల ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం ఎంత వరకు వచ్చిందో తెలపాలని కూడా ఆయన మంత్రిని కోరారు.ఈ బిల్లులో ప్రభుత్వం పొందుపరచిన వివిధ అంశాలను పరిశీలిస్తే హోమియోపతి సెంట్రల్ కౌన్సిల్, ఇండియన్ మెడిసిన్ సెంట్రల్ కౌన్సిల్ రెండూ కూడా ఎలాంటి స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా ప్రభుత్వ అజమాయిషీ, చెప్పు చేతల కింద పని చేయాల్సి ఉంటుందని స్పష్టం అవుతున్నట్లుగా విజయసాయి రెడ్డి చెప్పారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇలాంటి కౌన్సిళ్ళు భారీత వైద్య విధానాన్ని ప్రోత్సహిస్తూ దానిని విస్తృతపరచేలా పనిచేయాలంటే వాటికి స్వయంప్రతిపత్తి అవసరం. అవి స్వతంత్రంగా పని చేసేలా ప్రభుత్వం ఎందుకు అనుమతించ కూడదని ఆయన ప్రశ్నించారు. ఇక హోమియోపతి విషయానికి వస్తే వైద్య సహాయంతో జరిగే గర్భ విచ్ఛిత్తికి ఆయుర్వేద, హోమియో వైద్యులను అనుమతించేందుకు చట్ట సవరణ చేయాలని 2014లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ చేసిన ప్రతిపాదన గురించి విజయసాయి రెడ్డి ప్రస్తావిస్తూ ఆ ప్రతిపాదన ఇంకా పరిశీనలోనే ఉందా లేక విరమించుకున్నారా అని ప్రశ్నించారు. దేశంలో హోమియోపతి మార్కెట్ టర్నోవర్ ఏటా 4 వేల కోట్ల రూపాయలు ఉంది. ఏటా ఇది 20 శాతం చొప్పున పెరుగు తోంది. ఈ మార్కెట్‌లో కేవలం 15 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉండంగా మిగిలిన 85 శాతం అసంఘటిత రంగం లో ఉంది. దీనిని క్రమబద్ధీ కరించడానికి ప్రభుత్వం ఎలాం టి చర్యలు తీసుకుంటున్నదో తెలపాలని ఆయన కోరారు.



## విశాఖ, విజయవాడలలో రోడ్డెక్కిన సిటీ బస్సులు



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 19** :కరోనా, లాక్‌డౌన్‌తో విశాఖపట్నం, విజయవాడలలో డిపోలకే పరిమితమైన ఆర్టీసీ సిటీ బస్సులు శనివారం ఉదయం నుంచి రోడ్డెక్కాయి. విశాఖపట్నం, విజయవాడ మహా నగరాల్లో సిటీ బస్సుల పున:ప్రారంభానికి ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యా, ఉద్యోగ పరీక్షల్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ అనుమతి మేరకు ఆర్టీసీ యాజమాన్యం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా నిబంధనల్ని పాటిస్తూ సిటీ బస్సులను నడుపుతున్నారు. ఆ దిశగా సిటీ సర్వీసుల్లో ప్రయాణించే వారికీ శానిటైజర్, మాస్క్ తదితర జాగ్రత్తల్ని పాటించేలా ఆర్టీసీ యంత్రాంగం అవగాహన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ నగరాల్లో దాదాపు ఆర్నెళ్ల నుంచి సిటీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కరోనా, లాక్‌డౌన్ ప్రభావంతో సాధారణ బస్సులతోపాటు సిటీ సర్వీసులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. లాక్‌డౌన్‌కు ముందు విజయవాడ, విశాఖపట్నం మహానగరాల్లో దాదాపు 1,100 సిటీ బస్సులుండగా, వాటి ద్వారా రోజుకు దాదాపు రూ.11 కోట్ల వరకూ ఆదాయం వచ్చేదని అధికారులు అంచనా. సిటీ సర్వీసులు డిపోల్లోనే నిలిచిపోవడంతో ఆర్టీసీకి తీవ్ర నష్టం వాటిల్లిన విషయం విదితమే. ఇప్పుడు బస్సులను పునరుద్ధరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఈడీ ఆపరేషన్స్ బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో సిటీ బస్సుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. విజయవాడ నగరంలోని పలు డిపోల్లో ఉన్న బస్సులను వాటర్‌తో శుభ్రం చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లను అందుబాటులోకి వచ్చేలా ఆదేశాలు జారీజేశారు. ఒక్కసారిగా సిటీ బస్సులు రోడ్డెక్కడంతో ఈ రెండు నగరాల్లో రూట్ల వారీగా బస్సుల పునరుద్ధరణ చర్యలకు డిపో మేనేజర్లు నిమగమయ్యారు. మంగళగిరి, విద్యా ధరపురం మైలవరం,ఆగిరిపల్లి తో పాటుదాదాపు 500 బస్సులు ప్రధాన మార్గాల్లో బస్సులు నడుస్తున్నాయి.



## వైసీపీ ఎమ్మెల్యేపై కేసు పెట్టాలని హైకోర్టు ఆదేశం

ఏపీ హైకోర్టు ఆదేశాలతో ఏకంగా వైసీపీ ఎమ్మెల్యే చిక్కుల్లో పడ్డారు. ఆయనపై కేసులు పెట్టాలని హైకోర్టు ఆదేశించడం సంచలనమైంది. వైసీపీ ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులు 12మందిపై ద్వారకా తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జల్లా గోపాలపురం పోలీసులు తలారి వెంకట్రావ్ పై కేసు నమోదైంది. ఏపీ హైకోర్టు ఆదేశాలతో ఆయనపై ఐపీసీ 448 506 సెక్షన్ల కింద ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులు 12మందిపై ద్వారకా తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. 2017 డిసెంబర్ లో తలారి వెంకట్రావు తన అనుచరులతో కలిసి తన ఇంటిపై దాడికి పాల్పడ్డారని మాలసానికుంటకు చెందిన ఆదిలక్ష్మీ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు అప్పుడు కేసు నమోదు చేయలేదు. దీంతో సదురు మహిళ ఈ దాడి వ్యవహారంలో పోలీసులు పట్టించుకోలేదని.. తనకు న్యాయం చేయాలని ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆదిలక్ష్మీ పిటీషన్ ను విచారణకు స్వీకరించిన హైకోర్టు ఎమ్మెల్యే వెంకట్రావ్ తోపాటు మరో 12మందిపై కేసు నమోదు చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించింది. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు వ్యవహారంపై ఎమ్మెల్యే స్పందించాల్సి ఉంది.

## 21 నుంచి తాజ్‌మహల్ సందర్శనకు అనుమతి



**ఢిల్లీ:** కరోనా సంక్షోభంలో సప్టెంబరు 21 వతేదీ నుంచి తాజ్ మహల్, ఆగ్రా కోటలను సందర్శించేందుకు పర్యాటకులను అనుమతించాలని కేంద్ర పురావస్తు శాఖ నిర్ణయించింది. దీంతో పర్యాటకుల రాక కోసం ఆగ్రా నగరంలోని హోటళ్లను శానిటైజ్ చేసి సిద్ధం చేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తితో దేశవ్యాప్త లాక్ డౌన్ వల్ల గత ఐదునెలలుగా తాజ్ మహల్‌ను మూసివేశారు. దీంతో ఆగ్రా నగరంలోని హోటళ్లు కూడా మూతపడటంతో యజమానులు తీవ్ర నష్టాల పాలయ్యారు. తాజ్ మహల్, ఆగ్రాకోటలను సందర్శకుల కోసం తెరవనున్నందున పర్యాటకులకు హోటల్ యజమానులు స్వాగతం చెప్పారు. ఈ నెల 21 నుంచి తాజ్ మహల్‌లో సందర్శకులను అనుమతించేందుకు ఆగ్రా జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆగ్రా పర్యాటక రంగం ఊపందుకోనుంది. చారిత్రాత్మక తాజ్‌మహల్‌ను సందర్శించాలనుకునే పర్యాటకులకు ఇది నిజంగా శుభవార్తే.

## నిధుల కోసం కేంద్రంపై ఏపీ - తెలంగాణ పోరు!!



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19** : కరోనా మహమ్మారి దెబ్బకు దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమైన సంగతి తెలిసిందే. ఓ వైపు ఖజానాకు ఆదాయం తగ్గడం...మరోవైపు కరోనా కట్టడికి ఖర్చులు పెరగడం వంటి నేపథ్యంలో దాదాపు రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో తమకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. అయితే రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ బకాయిలను తర్వాత చెల్లిస్తామని ఈ లోపు ఆ మొత్తాన్ని అప్పు తెచ్చుకోవాలని కేంద్రం ఉచిత సలహా ఇచ్చింది. అసలే కరోనా కష్ట కాలంలో ఉన్నామని జీఎస్టీ బకాయిల చెల్లింపుల కోసం కేంద్రమే అప్పు చేయాలమి రాష్ట్రాలను ఆర్థికంగా ఆదుకునేలా చర్యలు చేపట్టాని రాష్ట్రాలు కోరుతున్నాయి. ఈ క్రమంలోనే ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఒకవైపు స్థానికంగా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తూనే కేంద్రం నుంచి వీలైనంతగా సాయం పొందేందుకు పార్లమెంటు వేదికగా ప్రయత్నిస్తున్నాయి. ప్రధాని మోడీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్లకు తరచూ వినతులను సమర్పిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఏపీకి ఆర్థిక సాయం అందించాలంటూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ తన తొలి ప్రసంగంలో ప్రస్తావించారు. ఏపీని లోన్ల రూపంలో కాకుండా గ్రాంట్ల రూపంలో ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఏపీ ఆర్థిక లోటును ఎదుర్కొంటోందని కరోనా విపత్తుతో ఆర్థిక వ్యవస్థ మరింత కుదేలైందని పేర్కొన్నారు.

## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో **వార్తావళి** దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## నూతన రథం నిర్మాణ పనులు ప్రారంభం

**అంతర్వేది:** వచ్చే స్వామి వారి కల్యాణోత్సవంకి నూతన రథం పై స్వామి వారి ఊరేగింపు జరగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించడంతో నూతన రథం నిర్మాణం పనులను పూజ చేసి శరవేగంగా ప్రారంభించిన అధికారులు దీనిలో భాగంగా రావులపాలెం వెంటసాయి టింబర్ డిపోలో ఉన్న కలపను గుర్తించి శాస్త్రోక్తంగా పూజ చేసి పనులను ప్రారంభించారు. నూతన రథం నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 95 లక్షల రూపాయిలు కేటాయించి, నూతన రథం నమునకి ఆమోదం తెలపడంతో నిర్మాణ పనులు అధికారులు శరవేగంగా చేస్తున్నారు.



శనివారం సీఎం క్యాంప్ కార్యా లయంలో ముఖ్య మంత్రిని కలిసిన విశాఖ సౌత్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అతని కుమారులు
- వార్తావళి, విజయవాడ

వార్త 8వ పేజీలో

## పార్లమెంట్ బడ్జెట్ సెషన్స్‌కి బ్రేక్ వేసిన కరోనా!



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** కరోనా విజృంభణ కొనసాగుతున్న సమయంలోనే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలని సెప్టెంబర్ 14 నుండి కేంద్రం ప్రారంభించిన సంగతి తెలిసిందే. వర్షాకాల సమావేశాలు అక్టోబర్ 1వ తేదీ వరకు కొనసాగుతాయని ప్రకటించిన కేంద్రం .. తాజాగా దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి పలువురు ఎంపీలు కూడా కరోనా భారిన పడుతుండటంతో సమావేశాలని కుదించాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఇద్దరు లోక్ సభ సభ్యులు ఒక రాజ్యసభ సభ్యుడు కరోనా కాటుకి బలైయ్యారు. దాంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు సెషన్ను కుదించే యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు 30 మంది ఎంపీలు కరోనా బారిన పడ్డారు. షెడ్యూల్ ప్రకారం ప్రస్తుత సమావేశాలు ఈ నెల 14 నుంచి అక్టోబర్ 1 వరకు జరగనున్నాయి. పార్లమెంటు ప్రాంగణం వద్ద అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో కేంద్రం పునరాలోచనలో పడింది. సమావేశాల రోజులను కుదించే యోచనలో కేంద్రం ఉందని పార్లమెంట్ అధికారులు చెపుతున్నారు. ప్రతి రోజు 90 వేలకు పైగా కేసులు దేశవ్యాప్తంగా నమోదవుతున్నాయి. గురు శుక్రశని వారాల్లో వరుసగా 95 వేలు 96 వేల 93 వేల చొప్పున కరోనా పాజిటివ్ కేసులు దేశంలో నమోదయ్యాయి. అదే సమయంలో కరోనా వైరస్ బారిన పడుతున్న పార్లమెంటు సభ్యుల సంఖ్య కూడా పెరుగుతోంది. దీనితో సమావేశాలని కుదించాలని అనుకుంటున్నారట. దీనిపై ప్రస్తుతం పలు రాజకీయ పార్టీల అభిప్రాయాన్ని సేకరించే పనిని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సిబ్బంది చేపట్టినట్లు సమాచారం. దీనితో సోమవారం లోపు ఓ నిర్ణయం వెల్లడించే అవకాశం ఉంది.

## గ్రామ సచివాలయాల్లో అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్

**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1783 విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ పోస్టుల నియామకం కొరకు గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న విద్యార్హతల నుండి కొన్నింటిని తొలగించినట్లు ఉద్యానవన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ వారు గుర్తించిన 4 సంవత్సరాల బిఎస్సి(హార్టికల్చర్), లేదా వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ నుండి 2 సంవత్సరాల డిప్లొమో(హార్టికల్చర్) పూర్తిచేసినవారు మాత్రమే అర్హులని,ఇవి గాక మరే అర్హతలున్నా వారి అభ్యర్థిత్వాన్ని పరిగణలోకి తీసుకోమని ఆయన వివరించారు. నియామకంలో భాగంగా ఈ నెల 25 న నిర్వహించనున్న పరీక్షలకు మిగతా అర్హతలున్నవారు ఒక వేళ హాజరై పరీక్ష రాసినా వారి అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోమని, అభ్యర్థులందరూ ఈ విషయం గమనించాలని కమిషనర్ చిరంజీవి చౌదరి కోరారు.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది. ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu333@gmail.com మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు. 8500159006 నెంబరుకు సంప్రదించగలరు
YouTube

# జాతీయం-అంతర్జాతీయం

## 9 మంది అల్ ఖైదా ఉగ్రవాదుల అరెస్టు




**ఎర్నాకుళం:** జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దేశవ్యాప్తంగా జరిపిన సోదాల్లో 9 మంది అల్‌ఖైదా ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వీరందరినీ పశ్చిమబంగాల్‌లోని ముర్షీదాబాద్, కేరళలోని ఎర్నాకుళంలో ఎన్ఐఏ అరెస్టు చేసింది. వీరిలో ఆరుగురు ముర్షీదాబాద్‌కు చెందిన వారు కాగా, మిగిలిన ముగ్గురు ఎర్నాకుళంకు చెందిన వారని ఎన్ఐఏ తెలిపింది. దేశవ్యాప్తంగా జనసమ్మర్థ ప్రదేశాల్లో బాంబు దాడులు జరిపి అమాయక ప్రజల ప్రాణాలు తీసేందుకు కుట్ర చేస్తున్నట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఉగ్రవాదుల నుంచి భారీ ఎత్తున దస్త్రాలను, డిజిటల్ డివైస్‌లను, జీహాదీ సాహిత్యాన్ని, దేశీయంగా తయారైన తుపాకులు, శరీర కవచాలు, ఇంట్లోనే పేలుడు పదార్థాలు తయారు చేయడానికి అవసరమైన పరిజ్ఞానంతో కూడిన మెటీరియల్, పదునైన ఆయుధాలను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. వీరంతా పాకిస్థాన్ కేంద్రంగా పని చేసే అల్‌ఖైదా అనుబంధ సభ్యులని ఎన్ఐఏ వెల్లడించింది. సమాజిక మాధ్యమాల ద్వారా అల్‌ఖైదాలో చేరి ఢిల్లీ సహా, దేశ వ్యాప్తంగా దాడులకు కుట్ర చేసినట్లు పేర్కొంది. నిధుల సేకరణకు పాల్పడటం సహా, వీరిలో కొందరు ఢిల్లీ వెళ్లి ఆయుధాలు కొనుగోలు చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు వివరించింది. "అల్‌ఖైదాకు చెందిన అంతర్రాష్ట్ర ఉగ్రముఠా పశ్చిమ బెంగాల్, కేళలోని వివిధ ప్రాంతాల్లో సామాన్య ప్రజలే లక్ష్యంగా పేలుళ్లకు పాల్పడేందుకు పన్నాగం పన్నుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండా మరి కొందరిలో ఉగ్రబీజాలు నాటేందుకు వీరంతా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో దాడులు నిర్వహించి వారందరినీ అరెస్టు చేశాం" అని ఎన్ఐఏకు చెందిన ఓ సీనియర్ అధికారి మీడియాకు వెల్లడించారు. ముర్షీద్ హసన్, యాకుబ్ బిస్వాస్, ముషారఫ్ హుస్సేన్‌లను కేరళలో అరెస్టు చేయాగా.. షకీబ్, అబు సోఫియాన్, మెయినల్ మోండల్, యీాన్ అహ్మద్, మనుమ్ కమల్, రెహ్మాన్‌లను ముషీరాబాద్‌లో అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరిని సంబంధిత కోర్టుల్లో హాజరుపరుస్తామని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

## అనుచిత ప్రవర్తన.. పోలీస్ సస్పెన్షన్



**లక్నో:** పొట్టకూటి కోసం రిక్షా నడుపుకుంటున్న ఓ వికలాంగుడితో అనుచితంగా ప్రవర్తించిన ఓ పోలీస్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్‌లో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకెళ్తే.. రాష్ట్ర రాజధాని లక్నోకు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనౌజ్‌లోని పోలీస్ స్టేషన్ వద్ద ఓ కానిస్టేబుల్ ఏ మాత్రం మానవత్వం లేకుండా వికలాంగుడిని చెంపదెబ్బ కొట్టి నేలమీదకు తోసేశాడు. ఇదంతా జరుగుతున్నా చుట్టూ ఉన్న పోలీసులు కూడా స్పందించ లేదు. కాగా.. రోడ్డు పక్కనే ఉన్న ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా కానిస్టేబుల్ తనపై దాడికి పాల్పడ్డాడని బాధితుడు చెప్తుండగా.. సదురు వ్యక్తి తప్పుగా ప్రవర్తించాడని కానిస్టేబుల్ ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఘటనపై కనౌజ్ జిల్లా పోలీస్ సూపరిండెంట్‌ను అమరేంద్ర ప్రతాప్ సింగ్‌ను వివరణ కోరగా.. కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించి, ఈ సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని సందర్భాలలో పోలీసు అధికారులు 'తమను తాము నియంత్రించుకోవాలే కానీ.. ప్రజలతో తప్పుగా ప్రవర్తించరాదు' అని సింగ్ అన్నారు.

## కోవిడ్ రోగిపై వైద్య సిబ్బంది దాడి



**గాంధీనగర్:** మంచినీళ్లు అడిగినందుకు ఓ కోవిడ్ పేషెంట్‌ని నర్సింగ్ సిబ్బంది చితకబాదిన వీడియో నిన్నటి నుంచి అన్ని మీడియా చానెళ్లలో ప్రసారం అవుతుంది. ఈ సంఘటన పది రోజుల క్రితం చోటు చేసుకుంది. ప్రస్తుతం బాధితుడు మరణించినట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. ప్రభాకర్ పాటిల్ అనే వ్యక్తి రాజ్‌కోట్ ప్రాంతంలోని ఓ కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షల అనంతరం అతడి కిడ్నీలో నీరు చేరిందని ఆపరేషన్ చేయాలని తెలిపారు వైద్యులు. దాంతో ప్రభాకర్ రెండు వారాల క్రితం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నాడు. సమస్య తీరిపోయింది అనుకుంటుండగా.. ఊపిరితీసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది. దాంతో వైద్యులు అతడికి కరోనా టెస్టులు చేయడంతో పాజిటివ్‌గా తేలింది. ఈ క్రమంలో ప్రభాకర్ సెపెప్టెంబర్ 8న రాజ్‌కోట్ కోవిడ్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తాగేందుకు మంచి నీళ్లు ఇవ్వాల్సిందిగా నర్సింగ్ సిబ్బందిని కోరాడు. దాంతో వారు ప్రభాకర్‌పై దాడి చేశారు. మీడియాలో తెగ వైరలయిన ఈ వీడియోలో నర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు కలిసి ప్రభాకర్ మీద దాడి చేయడం చూడవచ్చు. అతడిని కిందపడేసి కంట్రోల్ చేయడానికి ప్రయత్నించారు. ఓ వ్యక్తి ప్రభాకర్‌పై కూర్చుని ఉండగా.. మరొకరు అతడిని చెంప మీద కొట్టారు. కామ్‌గా ఉండమని ఆదేశించారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరో విచారకరమైన విషయం ఏంటంటే.. ప్రభాకర్ ఈ నెల 12న మరణించాడు. దీని గురించి అతడి సోదరుడు విలాస్ పాటిల్ మాటట్లాడుతూ.. 'గత శనివారం నా సోదరుడు మరణించాడు. అంతకు ముందే సిబ్బంది తనని దారుణంగా కొట్టారు. మరణించిన అనంతరం తన మృతదేహాన్ని కూడా మాకు అప్పగించలేదు. ప్రోటోకాల్ ప్రకారం తనకి అంత్యక్రియలు చేయలేదు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం, అమానవీయ ప్రవర్తన కారణంగానే తను మరణించాడు.

## అమెరికాలో కాల్పులు: 12 మంది మృతి



**వాష్టింగన్ :** అగ్రరాజ్యం అమెరికా మరోసారి రక్తమోడింది. న్యూయార్క్‌లోని రోచెస్టర్‌లో పెద్ద ఎత్తున కాల్పులు చోటుచేసుకున్నాయి. గుర్తు తెలియని దుండుగులు జరిపిన ఈ కాల్పుల్లో 12 మంది పౌరులు అక్కడికక్కడే మృతి చెందారు. రోచెస్టర్‌లో వేర్వేరు ప్రాంతాల్లో కాల్పులు జరిగినట్టు గుర్తించారు. అమెరికా కాలమానం ప్రకారం అర్థరాత్రి 12.30కు ఈ కాల్పులు చోటుచేసుకున్నాయి. అయితే దేశంలో నల్లజాతీయులపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా రోచెస్టర్‌లో అర్థరాత్రి వరకుఆందోళన కొనసాగాయి. ఈ ఆందోళన కొనసాగుతుండగానే కాల్పులు చెలరేగాయి. ఈ ఘటనలో పెద్ద ఎత్తున పౌరులు తీవ్ర గాయలపాలైయ్యారు. పౌరుల మృతిపై యావత్ అమెరికా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కాల్పులకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కొవిడ్ టెస్ట్: 90నిమిషాల్లోనే కచ్చితమైన ఫలితం!

### లండన్ పరిశోధకుల కొత్త విధానం



**లండన్:** కరోనా వైరస్‌ను అతి తక్కువ సమయంలోనే నిర్ధారించే పరీక్షను లండన్ శాస్త్రవేత్తలు రూపొందించారు. ఎలాంటి ప్రయోగశాల అవసరం కూడా లేకుండానే డీఎన్ఏనడ్జ్ పరీక్ష ద్వారా కేవలం గంటన్నరలోనే కచ్చితమైన ఫలితం వస్తున్నట్లు గుర్తించారు. తాజా పరీక్ష పరిశోధనా పత్రాన్ని ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ లాన్సెట్ ప్రచురించింది. కరోనా వైరస్ విజృంభణతో ప్రపంచ దేశాలు కకావికలం అవుతోన్న విషయం తెలిసిందే. ఈ సమయంలో వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రస్తుతం ఉన్న ఏకైక మార్గం..వీలైనంత త్వరగా వైరస్ సోకినవారిని గుర్తించడమే. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా ఆర్‌టీ–పీసీఆర్ విధానంలో కొవిడ్ టెస్టులు చేస్తున్నారు. దీనికి ఎక్కువ సమయం తీసుకోవడం ప్రతికూలంగా మారింది. ఇక కొన్ని ప్రాంతాల్లో త్వరగా ఫలితమిచ్చే ర్యాపిడ్ యాంటీజెన్ టెస్టులు చేస్తున్నప్పటికీ తీవ్ర లక్షణాలు ఉన్నవారిలోనే కొంతవరకు కచ్చితమైన ఫలితాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో డీఎన్ఏ ఆధారిత టెస్టును లండన్‌లోని ఇంపీరియల్ కాలేజికి చెందిన నిపుణులు రూపొందించారు. ప్రయోగాల్లో ఇది విజయవంతం కావడంతో దీన్ని వినియోగించవచ్చని అక్కడి వైద్య పరికరాల నియంత్రణ ఏజెన్సీ (ఎంహెచ్ఆర్ఏ) ఏప్రిల్ చివరిలోనే ఆమోదం తెలిపింది. కొవిడ్–19 వైరస్ సోకిన వారిని 94.4శాతం కచ్చితత్వంతో గుర్తిస్తుండగా, వైరస్ లేనివారిని వందశాతం కచ్చితత్వంతో గుర్తించ గలుగుతున్నట్లు లాన్సెట్ పేర్కొంది. ఈ పరీక్ష ద్వారా ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండానే మనం ఉన్నచోటే ఫలితం పొందవచ్చని ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన నిపుణులు పేర్కొన్నారు.

## రష్యాలో మెడికల్ షాపుల్లో కరోనా ఔషధం!



**మాస్కో:** ఇప్పటికే కరోనా మహమ్మారికి వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు ప్రకటించిన రష్యా.. తాజాగా మరో ఔషధానికి అనుమతించింది. మోతాదు లక్షణాలున్న కొవిడ్ బాధితులకు చికిత్స అందించేందుకు 'కరోనావిర్' అనే ఔషధాన్ని తీసుకొచ్చింది. వచ్చే వారం నుంచి దీన్ని సాధారణ మెడికల్ షాపుల్లో విక్రయించేందుకు అనుమతించింది. ఈ మందును ఆర్–ఫార్మ్ అనే కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. మేలో అవిఫవిర్ అనే జనరిక్ ఔషధానికి కూడా రష్యా అనుమతించింది. అయితే, దీన్ని సాధారాణ మందుల దుకాణాల్లో కాకుండా వైద్యుల పర్యవేక్షణలో వాడాలని సూచించింది. ఈ రెండు ఔషధాలు ఫవిపిరవిర్ ఆధారంగా అభివృద్ధి చేసినవే. కరోనా వైరస్‌కు వ్యాక్సిన్, ఔషధాన్ని కనిపెట్టేందుకు ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలో టీకా కనిపెట్టినట్లు తొలుత ప్రకటించిన రష్యా.. దాని ఔషధాల్ని కూడా వేగంగా తీసుకొచ్చేందుకు పావులు కదుపుతోంది. తద్వారా కరోనా వైరస్‌పై విజయం సాధించే క్రమంలో నెలకొన్న పోటీలో ముందుండేందుకు ప్రయత్నిస్తోంది. కరోనావిర్‌కు జులైలోనే ప్రయోగాత్మకంగా వినియోగించేందుకు అనుమతి లభించింది. ప్రస్తుతం దీని క్లినికల్ ట్రయల్స్ మూడో దశలో ఉండగానే మార్కెట్లో విక్రయానికి అనుమతించారు. ఇప్పటికే ఆర్–ఫార్మ్ కరోనావిర్‌కు సంబంధించిన ఆర్డర్లను స్వీకరిస్తోంది. రష్యా అభివృద్ధి చేసిన స్పుత్నిక్–వి వ్యాక్సిన్ కోసం సైతం వివిధ దేశాలు ఒప్పందాలు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఫావిపిరవిర్‌ను భారత్‌లోనూ వివిధ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే.

## అమెరికాపై చర్యలు తప్పవు..చైనా

### బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపణ



**బీజింగ్:** చైనా తీరుపై ఇప్పటికే గుర్రుగా ఉన్న అమెరికా చర్యలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా చైనా యాప్‌లపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. చైనా కంపెనీలపై ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై డ్రాగన్ మండిపడుతోంది. తాజాగా టిక్‌టాక్, వీచాట్ యాప్‌లను నిషేధిస్తున్నట్లు అమెరికా ప్రకటనపై చైనా వాణిజ్యశాఖ స్పందించింది. చైనా సంస్థలపై చర్యలు తీసుకోవడం ద్వారా అమెరికా బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. అయితే, ఇకనైనా ఇలాంటి బెదిరింపులను మానుకోవడంతోపాటు చైనా సంస్థలపై అనైతిక చర్యలను నిలిపివేయాలని అమెరికాకు సూచించింది. అంతర్జాతీయ నియమాలను పాటిస్తూ నైతికత, పారదర్శకతతో కార్యకలాపాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఒకవేళ అమెరికా ఇలాగే ఏకపక్ష ధోరణిలో ముందుకెళ్తే మాత్రం దీటుగా స్పందిస్తామని హెచ్చరించింది. చైనా కంపెనీల ప్రయోజనాలను కాపాడటం కోసం అవసరమైన చర్యలకు ఉపక్రమించక తప్పదని చైనా వాణిజ్యశాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే, వీచాట్ యాప్‌పై నిషేధం ఆదివారం నుంచి అమలులోకి రానుండగా, ప్రస్తుతానికి టిక్‌టాక్ యాప్ అప్‌డేట్ చేసుకోవడానికి మాత్రం వీలుండదు. టిక్‌టాక్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న యూజర్లు నవంబర్ 12వరకు వినియోగించుకోవచ్చు. ఈలోగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టిక్‌టాప్‌పై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

## అమెరికా బెదిరింపు చర్యలు మానుకోవాలి




**బీజింగ్:** జాతీయ భద్రతను కాపాడటానికి చైనా సోషల్‌మీడియా యాప్‌లు టిక్‌టాక్, వీ చాట్ లను ఆదివారం నుంచి నిషేధిస్తూ అమెరికా ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. దీనిపై చైనా శనివారం స్పందించింది. అమెరికా బెది రింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. 'బెదిరింపులను మానుకోవాలని, (దాని) తప్పుడు చర్యలను నిలిపివేయాలని.. న్యాయమైన, పారదర్శక అంతర్జాతీయ నియమాలను, ఆర్డర్లను ఖచ్చితంగా పాటించాలని చైనా అమెరికాను కోరుతోంది అని తెలిపింది. అంతేకాక అమెరికా తనదైన మార్గంలో వెళ్లాలని పట్టుబడుతుంటే, చైనా కంపెనీల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చైనా తెలిపింది. అమెరికా జారీ చేసిన ఆర్డర్ ప్రకారం, టెన్సెంట్ యాజమాన్యంలోని వీచాట్ యాప్ ఆదివారం నుంచి అగ్రరాజ్యంలో తన కార్యాచరణను కోల్పోతుంది. ఇక టిక్‌టాక్‌పై ప్రసస్తుతం అప్‌డేట్ ఇన్‌స్టాల్ చేయకుండా నిషేధం విదించారు. కాకపోతే నవంబర్ 12 వరకు టిక్‌టాక్‌ను యాక్సెస్ చేయవచ్చు. సెప్టెంబర్ 15లోపు, టిక్‌టాక్, వీ చాట్ యాప్‌ల యాజమాన్యాలు అమెరికా చేతికి రాకపోతే, వాటిపై నిషేధం విధిస్తున్నట్టు ట్రంప్ గతనెలలోనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. చైనా దురుద్దేశంతో అమెరికా పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తుందని, జాతీయ, ప్రజాస్వామిక విలువలను కాపాడుకోవడానికి అధ్యక్షుని ఆదేశాల మేరకు ఈ నిషేధం విధిస్తున్నట్టు యూఎస్ కామర్స్ సెక్రటరీ విల్‌బుర్ రాస్ చెప్పారు.

## ఏప్రిల్ నాటికి అందరికీ వ్యాక్సిన్: ట్రంప్



**వాషింగ్టన్:** కరోనా వైరస్ వ్యాక్సిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా పౌరులందరికీ సరిపడా వ్యాక్సిన్ డోసులు ఏప్రిల్ 2021 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. "వ్యాక్సిన్‌కు అనుమతులు లభించిన వెంటనే ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ప్రతినెలా లక్షలాది డోసులు ఉత్పత్తి చేస్తాం. ఏప్రిల్ 2021 నాటికి అందరికీ సరిపడా వ్యాక్సిన్ డోసులు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నాం" అని శ్వేతసౌధంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా వైద్యులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు వ్యాక్సిన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం మూడు వ్యాక్సిన్లు తుది దశ క్లినికల్ ట్రయల్స్‌కు చేరుకున్నాయన్నారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనాలంటే వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని అభిప్రాయపడ్డారు. ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు అనేక రకాల ఆంక్షలకు సైతం టీకా చెక్ పెట్టనుందన్నారు. సత్ఫలితాలిచ్చే అవకాశం ఉన్న వ్యాక్సిన్ల ఉత్పత్తిని ఇప్పటికే భారీ ఎత్తున ప్రారంభించామన్నారు.

## 24గంటల్లో 93వేల కేసులు, 1247 మరణాలు!



**ఢిల్లీ:** దేశంలో కరోనా వైరస్ మహమ్మారి ఉద్ధృతి కొనసాగుతున్నప్పటికీ నిత్యం కోలుకుంటున్న వారిసంఖ్య క్రమంగా పెరుగుతోంది. నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా 95వేల మంది కోలుకుని డిశ్చార్జి అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక రోజువారీగా పాజిటివ్ కేసులు భారీస్థాయిలో నమోదవుతున్నాయి. గడిచిన 24గంటల్లో దేశవ్యాప్తంగా 8,81,911 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా వీటిలో 93,337 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. దీంతో శనివారం నాటికి దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 53,08,014కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. వీరిలో ఇప్పటికే 42లక్షల మంది కోలుకోగా, మరో 10లక్షల 13వేల యాక్టివ్ కేసులు ఉన్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఇక దేశవ్యాప్తంగా కరోనా సోకి మరణిస్తున్న వారిసంఖ్య పెరుగుతూనే ఉంది. నిన్న మరో 1247 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో ఇప్పటివరకు కరోనా సోకి మృతిచెందిన వారిసంఖ్య 85,619కి చేరింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 79.28శాతానికి చేరగా.. మరణాల రేటు 1.61శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.

## బ్రిటన్‌లో కరోనా రెండో దశ!

### ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రకటన



**లండన్:** కరోనా మహమ్మారితో అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న దేశాల్లో బ్రిటన్ ఒకటి. తాజాగా ఆ దేశ ప్రధాని బోరిస్ జాన్సన్ చేసిన ప్రకటన మరింత కలవరానికి గురిచేస్తోంది. దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి రెండో దశ(సెకండ్ వేవ్) ప్రారంభమైందని తెలిపారు. పరోక్షంగా మరోసారి కఠిన ఆంక్షలు తప్పకపోవచ్చునని సంకేతాలు ఇచ్చారు. ఫ్రాన్స్, స్పెయిన్‌లో తగ్గుముఖం పట్టిన కేసులు తిరిగి విజృంభించాయని.. అదే తరహాలో బ్రిటన్ కూడా రెండో దశ ఎదుర్కోవడం అనివార్యమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అమల్లో ఉన్న భౌతిక దూరం వంటి కొవిడ్ కట్టడి నిబంధనల్ని మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడొద్దనే నిబంధనలు అక్కడ ఇప్పటికే అమలులో ఉన్నాయి. బ్రిటన్‌లో శుక్రవారం కొత్తగా 4,322 కేసులు వెలుగులోకి వచ్చాయి. మే నెల తర్వాత ఈ స్థాయిలో కొత్త కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. దీంతో రెండో దశ వ్యాప్తి ప్రారంభమైందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు దేశంలో 3,88,412 కేసులు నమోదయ్యాయి. వీరిలో 41,821 మంది మరణించారు. కేసులు గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టడంతో నిర్ధారణ పరీక్షల తగ్గించారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొంత మంది పరీక్షల కోసం ఏకంగా కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చిందని స్థానిక మీడియా పేర్కొంది.




# రాయగడ రహదారి మరమ్మతులకు నిధులు

### ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి వెల్లడి



**జియ్యమ్మవలస, వార్తావళి, సెప్టెంబర్ 19:** పూర్తిగా పాడైపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్న రాయగడ రోడ్డు తక్షణ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1.06 కోట్లను మంజూరు చేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి వెల్లడించారు. అలాగే ఈ రహదారిలో పూర్తి స్థాయిలో రిపేర్లు చేపట్టడానికి అదనంగా మరో రూ. 6 కోట్లు మంజూరు చేయాలని కూడా ప్రతిపాదించామని తెలిపారు. జిల్లాలోని చిలకపాలెం నుంచి రామభద్రాపురం మీదుగా రాయగడకు వెళ్లే రాష్ట్ర రహదారి ఈ మధ్యకాలంలో పూర్తిగా పాడైపోవడంతో వాహనాలు గుంత మిట్టల్లో దిగబడిపోవడం, ట్రాఫిక్‌కు గంటల తరబడిగా అంతరాయం ఏర్పడటంతో ఈ రహదారిలో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా మారిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఈ రహదారిలో పార్వతీపురం నుంచి కొమరాడ వరకు ఉన్న రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో గత నెల రోజులుగా పార్వతీపురం నుండి కొమరాడ మధ్యలో రోడ్డు పూర్తిగా పాడవడంతో ట్రాఫిక్ సమస్యలతో పూర్తిగా స్తంభించింది. ఈ విషయంగా స్పందించిన ఉపముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి ఈ రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని అందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ప్రత్యేకంగా సమీక్షా సమా వేశాన్ని నిర్వహించిన ఆర్ అండ్ బీ అధికారులు రాయగడ రోడ్డులో పార్వతీపురం నుండి కొమరాడ వరకు రోడ్డు తక్షణ మరమ్మత్తుల నిమిత్తం ఈ మేరకు నిధులు మంజూరు అయ్యేలా చూస్తామని, పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం చేస్తామని ఈ సందర్భంగా పుష్ప శ్రీవాణి హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ భవనాల్లో అంగన్వాడీలు

### ఐ.సి.డి.ఎస్ పథక సంచాలకులు డా. జి.జయలక్ష్మి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** జిల్లాలో ఇకపై ప్రభుత్వ భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలు ఉండాలని, ఇందుకు నాడు – నేడు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళ,శిశు సంక్షేమ శాఖ మరియు ఐ.సి.డి.ఎస్ పథక సంచాలకులు డా.జి.జయలక్ష్మి సి.డి.పి.ఓ లను ఆదేశించారు. సోమవారం ఉదయం ఐ.సి.డి.ఎస్. కార్యాలయంలో నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణం, ప్రస్తుత భవనాల మరమ్మతులపై సి.డి.పి.ఓ లతో ఆమె సమీక్షించారు. తొలుత పంచాయతీల వారీగా అద్దె భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల వివరాలు తెలుసుకున్న ఆమె ఇకపై ప్రభుత్వ భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలు ఉండాలని స్పష్టం చేశారు. నాడు – నేడు క్రింద అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. అందులో భాగంగా అద్దె భవనాల్లోని అంగన్వాడీ కేంద్రాలు ఇకపై ప్రభుత్వ భవనాల్లో ఉండాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, ఆ నివేదిక తమకు అందిస్తే వాటిని సంయుక్త కలెక్టర్ కు సమర్పించడం జరుగుతుందని చెప్పారు. నూతనంగా నిర్మించబోయే అంగన్వాడీ కేంద్రాలు సచివాలయాలకు, గ్రామాలకు దగ్గరలో ఉండేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ భవనాల్లో ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రాలకు మరామ్మతులు చేపట్టవలసివస్తే వాటి అంచనా వివరాలను తమకు అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిని సారించాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ లు, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ పరీక్షల ఏర్పాట్లను పరిశీలించిన జె.సి



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** నేటి నుండి జిల్లాలో జరగనున్న గ్రామ, వార్డు సచివాలయ పోస్టుల నియామక పరీక్షల ఏర్పాట్లను సంయుక్త కలెక్టర్ డా.కె.శ్రీని వాసులు పరిశీలించారు. స్థానిక జిల్లా పరిష త్‌లో ఏర్పాటుచేసిన సచివాలయ పరీక్షల మెటీరియల్ స్టాక్ పాయింట్ ను జె.సి శనివారం మధ్యాహ్నం సందర్శించారు. అనంతరం మెటీరియల్ పంపిణీ కార్యక్ర మాన్ని స్వయంగా పరిశీలించారు. తొలుత మండలాల వారీగా సచివాలయ పరీక్షల మెటీరియల్ పంపిణీ వివరాలను జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.చక్రధర రావుని అడిగి తెలుసు కున్న ఆయన మెటీరియల్ తీసుకున్న రూట్ అధికారులకు జె.సి పలు సూచనలు చేశారు. మెటీరియల్ ఉన్న వాహనాలు ఎక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ఇందుకు రూటు అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. ఒక్కో మండలానికి ఒక్కో కోడ్ కేటాయించడం జరిగిందని, తమకు కేటాయించిన మెటీరియల్ సరిపోయినది లేనిదీ పరిశీలించుకోవలసిన బాధ్యత కూడా రూట్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జి.చక్రధరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, ఏ.కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం అప్పు అక్షరాల రూ.101.3లక్షల కోట్లు



దేశాన్ని అభివృద్ధి పథంలోకి దూసుకెళ్లేలా చేస్తున్నామంటూ పాలకులు చెబుతున్న మాటలు కట్టుకథలేనని తేలిపోయింది. అభివృద్ధి సంగతి దేవుడెరుగు.. అసలు రోజురోజుకు అథపాతాళానికి దిగజారిపోతున్నామని తేలిపోయింది. గత మార్చి నుంచి రూ. 6.7 లక్షల కోట్లు రుణం తెచ్చుకున్నట్లు స్వయంగా కేంద్రమే అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం రుణాలు జూన్ చివరినాటికి రూ.101.3 లక్షల కోట్లకు పెరిగాయి. మార్చినాటికి రూ.94.6 లక్షల కోట్ల అప్పు ఉండగా, మూడు నెలల వ్యవధిలోనే రూ.6.7 లక్షల కోట్ల రుణం తీసుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వ రుణ నిర్వహణపై శుక్రవారం విడుదలైన త్రైమాసిక నివేదికలో ఈ విషయం వెల్లడయింది. ఈ మూడు నెలల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూ.3.46 లక్షల కోట్లకు సెక్యూరిటీ బాండ్లను విడుదల చేసింది. వీటి సగటు మెచ్యూరిటీ కాలపరిమితి 14.61 సంవత్సరాలుగా నమోదయింది. ఈ సెక్యూరిటీలను 39శాతం మేర వాణిజ్య బ్యాంకులు, 26.2 శాతం మేర బీమా కంపెనీలు కొనుగోలు చేశాయి. ఇదే సమయంలో స్వల్పకాలిక సెక్యూరిటీ బాండ్లు లాంటి క్యాష్ మేనేజ్‌మెంట్ బిల్స్ జారీ చేయడం ద్వారా మరో రూ.80వేల కోట్లు సేకరించగలిగింది. బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీల విక్రయం ద్వారా ఇంకో రూ.10వేల కోట్లు సమకూర్చుకొంది. ప్రభుత్వ బాండ్ల ద్వారా ఈ త్రైమాసికంలో సగటున 5.85 శాతం ఆదాయం సమకూరింది. అంతకుముందు త్రైమాసికంలో 6.70 శాతం ఆదాయం రాగా ప్రస్తుతం తగ్గడం గమనార్హం. మొత్తమ్మీద ఈ త్రైమాసికంలో ద్రవ్యలోటు రూ.6,62,363 కోట్లకు చేరుకుంది.

# పెట్రోలు ధరలు పెంచడం దారుణం



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, కరోనా కష్టాలతో ప్రజలు విలవిలాడుతుంటే ప్రభుత్వం పెట్రోలు ధరలు పెంచడం దారుణం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనావల్ల ప్రజా రవాణా వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో ఆటోలు డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని,ఇప్పుడు పెట్రోల్ ధరలు పెంపు వారి జీవితాలను మరింత ప్రభావితం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క ఉపాదిలేక, ఆదాయం లేక నిరువులేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు దినదిన గండం చందంగా రోజులు గడుపుతున్నారని, విపత్కర కాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను మరింత పాతాళానికి నెట్టేస్తుందని శివరామకృష్ణ విమర్శించారు. వైకాపా కు ఓట్లేసి గెలిపించి అధికారం కట్టబెడితే ప్రభుత్వం లోకి వొచ్చిన దగ్గర నుంచి జగన్మోహన్ రెడ్డి ప్రజలపై కక్ష తీర్చుకుంటున్నారన్నారు. అధికారాన్ని సొంత లాభాలు కోసం, వ్యాపారాల కోసం వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. రోడ్డు అభివృద్ధి పన్ను అంటూ పెట్రోల్ ధరలు పెంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రోడ్డు టాక్స్, వ్యాట్, టోల్ చార్జీలు ఉండగా మళ్ళీ రోడ్డు అభివృద్ధి టాక్స్ అంటూ పన్ను భారం వేయడం సరికాదని తక్షణమే ప్రస్తుత పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



బొండపల్లి మండలం కనిమెరక గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఈ– సేవలపై వి.ఆర్.ఓ.ను ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ డా ఎం.హరిజవహర్ లాల్

– వార్తావళి, ఎస్‌కోట



బొండపల్లి మండలం కనిమెరకలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డా ఎం.హరిజవహర్ లాల్

– వార్తావళి, సాలూరు



బొండపల్లి మండలం కనిమెరక గ్రామ పర్యటనలో భాగంగా మునకాల కొండమ్మ అనే వృద్ధ మహిళతో మాట్లాడి ఆమెకు ఫించన్ వస్తోందా, ఎప్పుడు వస్తోందని ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ డా ఎం. హరిజవహర్ లాల్, ప్రతి నెలా ఒకటో తేదీన ఫించన్ మొత్తం అందుతుందని తెలిపిన మహిళ కొండమ్మ

– వార్తావళి, సాలూరు

# దేశంలోనే అతిపెద్ద ఫిలింసిటీని నిర్మిస్తా యోగి ఆదిత్యనాథ్



**ఉత్తరప్రదేశ్ :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే అతిపెద్ద ఫిలింసిటీని నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం నోయిడాలో అనువైన స్థలాన్ని చూడాలని అధికారులను ఆదేశించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో జరిగిన సమీక్ష సందర్భంగా సీఎం ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. గౌతం బుద్ధనగర్ జిల్లాలో దేశంలోనే అతిపెద్ద, అందమైన ఫిలింసిటీని నిర్మించనున్నట్టు చెప్పారు. దీని నిర్మాణం కోసం నోయిడా, గ్రేటర్ నోయిడా, యమునా ఎక్స్‌ప్రె వే సమీపంలో స్థలాన్ని చూడాలని అధికారులను ఆదేశించారు.

## కరోనా బాధితులకు ప్రాణ దానం చెయ్యండి

### విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** కరోనా బాధితులకు ప్లాస్మాను ఇచ్చి ప్రాణదానం చెయ్యాల్సిందిగా విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి, ఐపిఎస్ తే. 19-09-2020 ది, శనివారం నాడు పిలుపునిచ్చారు. విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి బి పాజిటివ్ ప్లాస్మాను దానం చేసి, ఒక వ్యక్తికి ప్రాణ దానం చేసిన చినమేరంగి కానిస్టేబులు జి.మల్లేశ్వరరావు (పిసి 1361)ను జిల్లా ఎస్పీ తన కార్యాలయానికి పిలిపించి, అభినందించి, పూలమాల, పుష్ప గుచ్ఛం, సాలువతో సత్కరించి, ప్రోత్సాహక నగదు, జ్ఞాపికను అందజేసారు.



# సీఎం జగన్ కరువు మండలాలను ప్రకటించాలి: భీశెట్టి



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** రాష్ట్రంలో ఖరీఫ్ రైతుల బాధలు చెప్పలేని స్థితిలో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పంటలు పండక బ్యాంకు్లు రుణాలు ఇవ్వక రైతులు త్రిశంకుస్వర్గంలో ఉన్నారని రైతు కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించాలని లోక్సత్తపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు,శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయం భారమై రైతులు అప్పులు పుట్టక ప్రైవేటు అప్పులభారంతో దిగాలుగా ఉన్నారని జూలైలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికి అనుకున్న స్థాయిలో వర్షాలు లేక పోవడంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని విశాఖపట్నం జిల్లాలో గత ఏడాది 1,67,466 హెక్టార్లలో వరి సాగు జరిగిందని ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో లక్ష్యం చేరలేని పరిస్థితులు ఉన్నాయని, విజయనగరం జిల్లాలో ఇప్పటికి 80 వేల హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పడ్డాయని వర్షబావం వలన ఉబాలు కానిచోట ఇతర పంటలు వేసుకోవడాని రైతులు తంటాలు పడుతున్నారని,శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ మండలాల్లో వర్షం లేక రైతులు వరినాట్లు వెయ్యలేదని కేవలం 95 వేల హెక్టార్లలో మాత్రమే ఉబాలు జరిగాయని రాష్ట్రంలోని తొంబై శాతం మండలాల్లో వారినారు ముదిరిపోయి,కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో ఎండి పోయినదని భీశెట్టి తెలిపారు, వర్షపాతం లోటు తో రైతులు అతలాకుతళం లో ఉన్నారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంటనే కరువు మండలాలు రైతులకు సకాలంలో పంట రుణాలు ఇప్పించాలని బ్యాంకు్లు రైతులుకు అండగా ఉండేలా చూడాలని ఖరీఫ్ సీజన్ అక్టోబర్ 30 తో ముగియనున్న తరుణంలో, కరువు మండలాలు,కరువు జిల్లాలు వెంటనే ప్రకటించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వివరాలుతో లేఖ రాసామని లేఖ విడుదల చేసారు,సాగుకు కీలకమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ఉంచాలని ప్రభుత్వంకి సూచించారు.

## బొబ్బిలి జోన్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షునిగా తుమరాడ గంగాధర్



**బొబ్బిలి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** బాలల హక్కుల పరిరక్షణయే ముఖ్య ధ్యేయంగా జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం చేతుల మీదుగా జిల్లా అధ్యక్షుడు అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణ మరియు నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిని కలుపుకుంటూ బొబ్బిలి జోన్ అధ్యక్షుడిగా బొబ్బిలికి చెందిన న్యాయవాది తుమరాడ గంగాధర్‌ను నియమిస్తూ నియామ కపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు గంగాధర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాలల శ్రమదోపిడి, వెట్టిచాకిరి నివారణ, 14 సంవత్సరాలలోపు బాలబాలికల కు పనిలో పెట్టుకున్న యజమానుల పై నేరుగా పోలీస్ వారికి ఫిర్యాదు చేయడం, మధ్యాహ్న భోజన పరిశీలన, పాఠశాల పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలు బాలబాలికలకు అందేలా చూడడం, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, తదితర విషయాల పైన కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం లీగల్ సెల్ అధ్యక్షులు కూరెల శ్రీనివాసరావు మరియు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల, పురపాలక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** పిఎన్ కాలనీ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ జె నివాస్ శనివారం తనిఖీ చేశారు. సచివాలయం నుండి అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లు, ఇతర సమాచారం, లబ్ధిదారుల జాబితాలు ప్రజల పరిశీలనకు ప్రదర్శించారా ? లేదా అని గమనించారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది కోవిడ్ సందర్భంగా చేపట్టిన ఇంటింటి సర్వే చేసిన పరిస్థితిని తనిఖీ చేశారు. సర్వేలో ఏ ఒక్కరిని విడిచి పెట్టలేదని తద్వారా కోవిడ్ లేకుండా నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ అన్నారు. వైరస్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని సూచిస్తూ అనారోగ్యం బారిన ఉన్నవారు ఏ ఒక్కరూ ఇంటివద్ద ఉండరాదని అన్నారు. కొంతమంది కరోనా పరీక్షలకు ముందుకు రావడం లేదని వాలంటీర్లు, సిబ్బంది జిల్లా కలెక్టర్ కు తెలియజేయగా అటువంటి వారి వద్ద నుండి ప్రభుత్వం నుండి ఎటువంటి సేవలు అవసరం లేదని వ్రాతపూర్వకంగా తీసుకో తీసుకోవాలని సూచించారు. తీవ్ర అస్వస్థతకు గురైన పుడు ఎటువంటి సహాయం అందే పరిస్థితి ఉండదని గమనించాలని, అది స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ప్రతి పథకానికి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారిని గుర్తించాలని అటువంటి జాబితాను సచివాలయం వద్ద ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. పథకాల అమలులో పారదర్శకత స్పష్టంగా ఉండాలని అదే ప్రభుత్వ విధానమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు వారి వద్దకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్న సంగతిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. సచివాలయాల ఏర్పాటు అందులో భాగమేనని అన్నారు. యువతగా అద్భుతమైన పనితీరు కనిపించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట రావు, ఆయుష్ వైద్య అధికారి సి.హెచ్. మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లాక్ డౌన్ పాక్షికంగా సడలింపు

### చేపలు, మాంసాహార దుకాణాలు, మార్కెట్లకు అనుమతి లేదు

**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** ఆదివారం సచివాలయ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా శ్రీకాకుళం పట్టణంలో లాక్ డౌన్ పాక్షికంగా సడలింపు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జె నివాస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం పట్టణంలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆదివారం రోజున కూడా లాక్ డౌన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే ఆదివారం సచివాలయ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా అధిక సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అభ్యర్థులకు ఆహార పానీయాలు, పరీక్షలకు సంబంధించిన పరికరాలు అవసరమయ్యే అవకాశం ఉందని, వాటికి ఇబ్బందులు తలెత్తకుండా లాక్ డౌన్ కు సడలింపు ఇచ్చామన్నారు. అభ్యర్థులు దేనికి ఇబ్బందులకు గురి కారాదని ప్రశాంతంగా పరీక్షలు రాసి సంతోషంగా వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. పాక్షికంగా సడలింపు ఇచ్చినప్పటికీ చేపలు, మాంసాహారానికి సంబంధించిన దుకాణాలు, మార్కెట్లకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. హెటళ్లు, ఇతర దుకాణాలు అనుమతించటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

# గ్రామ సచివాలయాలను పటిష్టం చేయడమే లక్ష్యం

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 19 :** గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయాలను పటిష్టంచేసి వీటి ద్వారా సేవలను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ చెప్పారు. సచివాలయ ఇ-సేవలు అందించడంలో మన జిల్లాలో పరిస్థితి మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగానే గ్రామ సచివాలయాల ద్వారా సేవలు ఏవిధంగా అందుతున్నాయో తెలుసుకొని సేవల పరిష్కారంలో వెనుకబడి వున్న ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. బొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ డా.హరిజవహర్ లాల్ శనివారం పర్యటించారు. కనిమెరకలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాన్ని తొలుత సందర్శించారు. భవన నిర్మాణం పురోగతి ఎప్పటికల్లా పూర్తవుతుందనే విషయాలను మండల ఇంజనీరింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. రూ.18 లక్షల మేరకు పని పూర్తయ్యిందని, సిమెంటు సరఫరా అవసరం మేరకు లేకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరుగుతోందని ఇంజనీరింగ్ అధికారి కలెక్టర్‌కు వివరించారు. వెంటనే ఎన్.సి.ఎల్. కంపెనీ ప్రతినిధి కుమార్ రాజాతో ఫోనులో మాట్లాడి కనిమెరక సచివాలయానికి 400 బస్తాల సిమెంటును తక్షణం సరఫరా చేయాలని, వచ్చే వారంలో బిల్లు చెల్లించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆదివారం నాటికి సిమెంటు సరఫరా చేసేందుకు ఆయన అంగీకరించారు. భవన నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తిచేసి అందిస్తామని ఎం.ఇ.ఓ. తెలిపారు.

# సంపాదకీయం

## శాంతి చర్చలు

అంతర్జాతీయ వాతావరణం ఎలావుందో ఎప్పటికప్పుడు గమనించుకుంటూ, మారిన పరిస్థితులకు తగినట్టు విధానాలు సవరించుకోనట్టయితే వెనకబడిపోవటం ఖాయం. ఈ సంగతిని మన దేశం ఆల స్యంగానైనా గ్రహించి అఫ్ఘానిస్తాన్ శాంతి చర్చల్లో పాలుపంచుకుంది. ఖతార్‌లోని దోహాలో అఫ్ఘాన్ ప్రభుత్వానికి, తాలిబన్‌లకు మధ్య ఆదివారం నుంచి జరుగుతున్న చర్చల్లో మన దేశంతో పాటు 15 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఫిబ్రవరిలో అమెరికా–తాలిబన్‌ల మధ్య ఒప్పందం కుదర డానికి రెండేళ్లముందు నుంచే వారిద్దరి మధ్యా చర్చలు జరుగుతున్నాయి. అప్పటినుంచీ ఇందులో పాలుపంచుకోమని అమెరికా మన దేశాన్ని కోరుతోంది. 2001లో తమ గడ్డపై ఉగ్రదాడి తర్వాత భూగోళంలో ఏ మూలనున్నా ఉగ్రవాదాన్ని అంతం చేస్తానని అమెరికా ప్రకటించి అఫ్ఘానిస్తాన్‌లోకి అడుగుపెట్టింది. వరస దాడులతో తాలిబన్‌లు నష్టాన్ని చవిచూసిన మాట వాస్తవమే. బిన్‌లాడెన్‌ను అమెరికా మట్టుబెట్టింది. ముల్లా ఒమర్‌ను కూడా హతమార్చింది. కానీ ఆ క్రమంలో అమెరికా కూడా భారీగా నష్టపోయింది. వేలాదిమంది సైనికులు బలయ్యారు. మరిన్ని వేలమంది గాయపడ్డారు. వేలాది కోట్ల డాలర్లు వెచ్చించినా ఈ యుద్ధం అంతమయ్యే జాడలు కనబడలేదు. ఈ పరిస్థితుల్లోనే 2016 అధ్యక్ష ఎన్నికల సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ తాను గెలిస్తే అమెరికా సేనల్ని వెనక్కి తీసుకొస్తానని వాగ్దానం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాలిబన్‌లతో ఒప్పందం కుదుర్చుకుని ఆ దిశగా ఆయన అడుగులేశారు. తాలిబన్‌లు ఇప్పుడు పూర్తిగా మారిపోయారని, అందువల్ల వారితో సర్దుకుపోవాలని మన దేశానికి అప్పటినుంచీ ఆయన చెబుతున్నారు. కానీ గతంలో వారితో వున్న చేదు అనుభవాలరీత్యా మన దేశం అందుకు సిద్ధపడలేదు. తాలిబన్‌లు పాకిస్తాన్ ప్రాపకంలో పని చేస్తారన్నది బహిరంగ రహస్యం. 90వ దశకంలో వారు అఫ్ఘాన్‌ను చెరబట్టినప్పుడు కశ్మీర్‌లో వారు సాగించిన హత్యాకాండ, సృష్టించిన విధ్వంసం ఎవరూ మరిచిపోరు. తాలిబన్‌లు 1999లో మన ఎయిరిండియా విమానం హైజాక్ చేసి ఇక్కడి జైళ్లలో వున్న తమ సహచరులు ముగ్గుర్ని విడిపించుకున్నారు. ఇదంతా చరిత్ర. కానీ ఇప్పుడు అమెరికా ఏదో విధంగా ఆ దేశం నుంచి బయటపడటం కోసం, అది సాధ్యమైనంత గౌరవప్రదంగా వుండటం కోసం తాపత్రయపడి తాలిబన్‌లతో ఒప్పందం చేసుకుంది. వారితో చర్చించేది లేదని భీష్మించుకుని కూర్చున్న అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీని సైతం ఒప్పించింది. ఆయన వద్దంటున్నా జైళ్లలో వున్న తాలిబన్ శ్రేణు లను విడిపించింది. ఆ ఒప్పందం తర్వాత కూడా గత ఆరునెలల్లో తాలిబన్‌లు స్త్రీలు, పిల్లలతోసహా 1,300మంది పౌరుల ప్రాణాలు తీశారని, అఫ్ఘాన్ జవాన్లు 3,560మంది వారి దాడుల్లో మరణించారని ఘనీ లెక్కలు చెప్పినా లాభం లేకపోయింది. ప్రస్తుత దోహా చర్చల్లో ఘనీ ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటున్నారు. మొదట్లో ఈ చర్చలను గట్టిగా వ్యతిరేకించి, అందులో పాలుపంచుకోవడానికి నిరాకరించిన మన దేశం సహజంగానే ఇప్పుడు 'బయటి దేశం'గా మిగిలింది. అయితే ఆలస్యంగానైనా ఇది మంచి నిర్ణయం. అఫ్ఘాన్ పునర్నిర్మాణంలో మన దేశం చురుగ్గా పాలుపంచుకుంది. పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. ఔషధాలు, నిత్యావసరాలు అందించంలో మొదటినుంచీ ముందుంది. కానీ ఘనీ ప్రభుత్వం అవసరమైనంతగా బలపడలేదు. దేశంలోని కొన్ని నగరాలకూ, పట్టణాలకూ ప్రభుత్వం పరిమితంకాగా... విశాల గ్రామీణ ప్రాంతాలు మొదటినుంచీ పూర్తిగా తాలిబన్‌ల నియం త్రణలో వున్నాయి. పాకిస్తాన్ జైల్లో పదేళ్లుగా బందీగావున్న తాలిబన్ సహ సంస్థాపకుడు ముల్లా అబ్దుల్ ఘనీ బరాదర్‌ను పాక్ పాలకులు ఒప్పించి, అమెరికాతో రాజీ కుదుర్చుకోవడానికి సిద్ధపడే షరతుపై 2018లో విడిచిపెట్టారు. అప్పటినుంచీ తాలిబన్‌లపై పాక్ పట్టు పెరిగింది. ఆ కారణంతోనే మన దేశం ఈ శాంతి చర్చలకు దూరంగా వుంది. కానీ అక్కడ తాలిబన్‌లు ప్రధాన పాత్రవహించే ప్రభుత్వానికి దూరంగా వుండటం వల్ల నష్టమే తప్ప ప్రయోజనం వుండదన్న అవగాహనతో చివరకు మన దేశం ఈ సమావేశంలో పాల్గొంది. అలా పాల్గొన్నప్పుడే భవిష్య అఫ్ఘాన్ ఎలావుండాలన్న అంశంలో మన వాదన వినిపించడానికి, తగినంతగా ప్రభావితం చేయడానికి అవకాశం వుంటుం దన్న నిపుణుల సూచన కొట్టిపారేయదగ్గది కాదు. అయితే తాలిబన్‌ల తాజా ప్రకటనల తీరు చూస్తే వారిలో మార్పు వచ్చిందంటున్న మాటలు ఎంతవరకూ సరైనవన్న సందేహాలు తలెత్తుతాయి. కాల్పుల విరమణ ప్రకటించాలన్న అఫ్ఘాన్, అమెరికాల వాదనను వారు ఒప్పుకోవడం లేదు. రెండు దశాబ్దాలుగా సాగుతున్న యుద్ధానికి మూల కారణమేమిటో చర్చించకుండా కాల్పుల విరమణ అంటే ఎలా అని తాలిబన్ ప్రతినిధులు ప్రశ్నిస్తు న్నారు. గత అయిదారురోజులుగా సాగుతున్న చర్చంతా ప్రధాన చర్చలకు ప్రాతిపదిక ఏర్పర్చడం కోసమే. కాల్పుల విరమణపై ఈ ప్రాథమిక చర్చల్లోనే ప్రతిష్టంభన ఏర్పడటం అనేక సందేహాలు కలిగిస్తోంది. అఫ్ఘాన్‌లో వున్న వివిధ మిలిటెంటు సంస్థల్లో తాలిబర్షీ ప్రధానమైనది.

# సెప్టెంబర్ 20 నట సామ్రాట్ అక్కినేని జయంతి

**1569 : మొఘల్ సామ్రాజ్యపు నాలుగవ చక్రవర్తి జహాంగీర్ జననం (మ.1627).**

**1911 : సంఘసంస్కర్త శ్రీరామ్ శర్మ ఆచార్య జననం (మ.1990).**

**1914 : తెలుగు శాస్త్రవేత్త, ఎ.యస్.రావు గా ప్రసిద్ధుడైన అయ్యగారి సాంబశివరావు జననం (మ.2003).**

**1924 : తెలుగు సినిమా నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు జననం (మ.2014). (చిత్రంలో)**

**1944 : భారత పార్లమెంటు సభ్యుడు అన్నయ్యగారి సాయిప్రతాప్ జననం.**

**1999 : తమిళ సినిమా నటి టి.ఆర్.రాజకుమారి మరణం (జ.1922).**

అక్కినేని నాగేశ్వరరావు కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో 1924 సెప్టెంబర్ 20న అక్కినేని వెంకటరత్నం, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. చిన్ననాడే నాటకరంగం వైపు ఆకర్షితుడై అనేక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించాడు. అక్కినేనితో అన్నపూర్ణ వివాహం 1949 ఫిబ్రవరి 18న జరిగింది. ఆమె పశ్చిమగోదావరి జిల్లా దెందులూరులో 1933 ఆగస్టు 14న జన్మించింది. వారికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు –అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశాడు. అన్నపూర్ణ 28.12.2011న మరణించింది. చిన్నప్పటి నుండి నాటకాల మీద వున్న ఆసక్తి తోనే 1941 లో పి.పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన ధర్మపత్ని చిత్రం ద్వారా బాల నటుడిగా పరిచయమయ్యాడు. ఆ తర్వాత 1944 లో ఘంటసాల బలరామయ్య తెరకెక్కించిన "సీతారామ జననం" సినిమాలో పూర్తి స్థాయి కథానాయకుడిగా నటించాడు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో కలిపి 256 సినిమాల్లో నటించాడు. ఆయన నటించిన ఆఖరి సినిమా "మనం". పలురకాల సాంఘిక, పౌరాణిక, జానపద సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించాడు. నటసామ్రాట్ బిరుదాంకితుడుగా నటనా ప్రస్థానంలో ఎన్నో పాత్రల్లో నటించి మరెన్నో మరపురాని చిత్రాల్లో తనకు మాత్రమే సాధ్యమయ్యే నటనతో అభిమానులను ఆకట్టుకున్నాడు. 1953 లో దేవదాసు చిత్రంతో ప్రేమికుడిగా తన నటనకు గాను విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. 1966 లో విడుదలైన నవరాత్రి సినిమాలో 9 పాత్రల్లో నటించాడు.




1975 లో భార్య అన్నపూర్ణ పేరు మీద అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించిన అక్కినేని అన్నపూర్ణ బ్యానర్ లో మొదటి సినిమా కళ్యాణి. అన్నపూర్ణ బ్యానర్ లో వచ్చిన మొదటి బ్లాక్ బస్టర్ మూవీ ప్రేమాభిషేకం. 1981 లో వచ్చిన ఈ సినిమా ఓ సంచలనం సృష్టించింది. అక్కినేని నటించిన తొలి స్వర్ణోత్సవ చిత్రం 1971 లో వచ్చిన దసరాబుల్లోడు. తెలుగులో తొలి ద్విపాత్రాభినయం చేసిన నటుడు అక్కినేని నాగేశ్వర రావు. చిత్ర పరిశ్రమని హైదరాబాదుకు రావడానికి ఎంతో కృషి చేశాడు. పర భాషా చిత్ర పరిశ్రమ నుండి తెలుగు చిత్ర పరిశ్రమని వేరు చేసి మన పరిశ్రమ ఔన్నత్యాన్ని దేశ విదేశాలకు చాటిన మహా నటుడు, నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత. తన వారసులను పరిశ్రమకు అందించాడు. కళాప్రపూర్ణ. గౌరవ డాక్టరేట్ అందుకున్న అక్కినేని 1968 లో పద్మశ్రీ అవార్డు, 1988 లో పద్మభూషణ్, 1989 లో రఘుపతి వెంకయ్య, 1990 లో దాదా సాహెబ్ ఫాల్కే, 1996 లో ఎన్టీయార్ జాతీయ అవార్డులూ అందుకున్నాడు. 2011 లో పద్మవిభూషణ్ అందుకున్న ఏకైక వ్యక్తి, నటుడు. భారతీయ సినీ రంగంలో అక్కినేని చేసిన అత్యుత్తమ సేవలకు గాను గౌరవ పద్మవిభూషణ్ అవార్డును అందుకున్న తొలి తెలుగు నటుడు. 1940 లో విడుదలైన "ధర్మపత్ని" ఆయన నటించిన మొదటి చిత్రం. అయితే పూర్తి స్థాయి కథానాయకుడిగా నటించిన మొదటి చిత్రం "శ్రీ సీతారామ జననం" (1944). ఆకర్షించే రాజకుమారుడినుండి విరక్తిచెంది మద్యానికి బానిసైన ప్రేమికుడి వరకు, ధీరుడైన సైనికుడినుండి పవిత్రుడైన ఋషి వరకు, కళాశాల విద్యార్థినుండి సమర్థుడైన ప్రభుత్వ అధికారి వరకు వివిధ రకాల పాత్రలలో నటించాడు. పౌరాణిక పాత్రలైన అభిమన్యుడు (మాయాబజార్), విష్ణువు (చెంచులక్ష్మి), నారదుడు (భూకైలాస్), అర్జునుడు (శ్రీకృష్ణార్జున యుద్ధం) లో రాణించాడు. గ్రామీణ ప్రాంతాలకు అద్దంపట్టే సినిమాలైన బాలరాజు, రోజులు మారాయి,, నమ్మినబంటులో నటించి, తెలుగు నటసామ్రాట్గా పేరుపొందాడు. మిస్సమ్మ, చక్రపాణి, ప్రేమించుచూడు లాంటి హాస్యరసప్రధాన చిత్రాలలో అందరి మన్ననలందుకున్నాడు. లైలామజ్ను, అనార్కలి (1955), బాటసారి, ప్రేమనగర్, ప్రేమాభిషేకం,, మేఘసందేశంలో నటన ద్వారా తెలుగుచిత్రరంగానికి విషాదరారాజుగా పేరుపొందాడు. దాసరి నారాయణ రావు దర్శకత్వం వహించిన ప్రేమాభిషేకం హైదరాబాదులో 533 రోజులు ప్రదర్శించబడి తెలుగుసినిమాలో రికార్డు నమోదు చేసింది.ఇది అంతరాయం లేకుండా 365 రోజులు నడచిన సినిమాల్లో ఒకే ఒక్క తెలుగు సినిమాగా నమోదైంది. తెలుగు సినిమాలలో ద్విపాత్రాభినయనానికి నాందిపలికిన అక్కినేని నవరాత్రి సినిమాలో తొమ్మిది పాత్రలలో నటించాడు. ప్రేమలో ఓడిపోయి మందుకు బానిసైన ప్రేమికుడిగా దేవదాసు చిత్రంలోని నటన శరత్ చంద్ర నవలలోని కథానాయకుడికి జీవంపోసింది. ఈ పాత్రకు ఆ తర్వాత మరెంతోమంది మరిన్ని భాషలలో నటించినా, హిందీ సినిమా నటుడు దిలీప్ కుమార్ అక్కినేని నటించినదే ఒకేఒక దేవదాసు అని అన్నాడు. సామాజిక ఇతివృత్తంగా నిర్మించ బడ్డ సినిమాలలో సంసారం, బ్రతుకు తెరువు, ఆరాధన, దొంగ రాముడు, డాక్టర్ చక్రవర్తి, అర్ధాంగి, మాంగల్యబలం, ఇల్లరికం, శాంతి నివాసం, వెలుగు నీడలు, దసరా బుల్లోడు, భార్యాభర్తలు, ధర్మదాత, బాటసారి,, కాలేజి బుల్లోడు లాభాలుపొందిన సినిమాలు. 1991 లోఆయన నటజీవితం స్వర్ణోత్సవం సందర్భాన విడుదలైన సీతారామయ్య గారి మనమరాలు, కొత్త, యువనటుల చిత్రాలతో పోటీపడి బాక్సాఫీసు హిట్ గా నిలిచింది. తన పుత్రుడు అక్కినేని నాగార్జున, మనవడు నాగచైతన్యతో కలిసినటించిన మనం ఆయన నటించిన చివరి సినిమా. వివిధ ప్రాంతాల సాహిత్య, సాంస్కృతిక వ్యక్తుల పాత్రలు అనగా, ఉజ్జయినికి చెందిన సంస్కృత విద్వాంసుడైన మహాకవి కాళిదాసు, ఒడిషాకి చెందిన భక్త జయదేవ, కర్ణాటకకు చెందిన అమరశిల్పి జక్కన, తమిళనాడుకి చెందిన భక్తుడు విప్రనారాయణ, గాయకుడు భక్త తుకారాం లను తెరమీదికి తేవటం ద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించి విమర్శకులు, కళాభిమానుల అభిమానాన్ని చూరగొన్నాడు. సినిమాల్లోనే కాదు, మట్టి మనుషులు, ఒకే ఒక్కడు టీవీ సీరియల్స్‌లో కూడా ఆయన నటనా ప్రతిభను మనం చూడవచ్చు.

అక్కినేని నాగేశ్వరరావు 91 సంవత్సరాల వయసులో 2014, జనవరి 22 న మరణించాడు. అర్ధరాత్రి దాటాక ఊపిరి తీసు కోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు 2.45 గంటల సమయంలో బంజారాహి ల్స్ లోని కేర్ ఆసుపత్రి తీసుకువెళ్ళారు. పదినిమి షాలకే డా. సోమరాజు వైద్యుల బృందంతో పరిశీలించగా మృతిచెందారని నిర్ధారణ అయింది.

# దశరథునికి కనిపించిన దృశ్యం

(నిన్నటి తరువాయి)

మోసగించడం, మోసపోవడం రాముడికి తెలీదయ్యా, అలాంటివాణ్ణి నువ్వు మోసగించావు. అమ్మో! నువ్వు మామూలు మనిషివి కాదు, నరరూపరాక్షసుడివి." అన్నది కౌసల్య. నెత్తీనోరూ మొత్తుకుంది. కుమిలి కుమిలి ఏడవసాగింది. నిజమే! తను నరరూపరాక్షసుడే! రాక్షసుడు కాబట్టే ఇంత ఘోరం జరిగినా ఇంకా ప్రాణాలతో ఉన్నాడు. మనిషి అయితే ఏనాడో చచ్చిపోయేవాడనుకున్నాడు దశరథుడు. కన్నతల్లి కడుపుమంట, ఎంతటి మాట నయినా అనగలుగుతుంది. అందుకే కౌసల్య భర్తని గాని, రాజనిగాని చూడకుండా నిష్ఠూరాలాడింది, తప్పులేదనుకున్నాడు. బాధలో అన్నా, కోపంలో అన్నా కౌసల్య నిజాలే పలికింది. అవును! తాను మాట తప్పలేకపోయాడు. మాట కోసమే మరణాన్ని కొని తెచ్చుకుంటున్నాననుకున్నాడు దశరథుడు. ఏ జన్మలో ఏ పాపం చేశానో అనుకున్నాడు. లీలగా ఏదో గుర్తొచ్చింది. బాణం దెబ్బకి విలవిల్లాడుతున్న ముని కుమారుడు కనిపించాడు. ఆ! అవును! ఏ జన్మలోనో కాదు, ఈ జన్మలోనే పాపం చేశాననుకున్నాడు దశరథుడు. గొల్లుమన్నాడు. ఏడుస్తున్న కౌసల్యను చూసి, ఆమెకు చేతులెత్తి నమస్కరించాడు."దేవీ, నువ్వు నన్ను ఎన్ని మాటలన్నా నేను బాధపడను. నిజమే, నేను తప్పు చేశాను, ఒప్పుకుంటున్నాను, నన్ను క్షమించు దేవీ, క్షమించు." అన్నాడు. ఆమె పాదాలను పట్టుకోబోయాడు. దశరథుణ్ణి వెనక్కి నెట్టి, కాళ్ళను ముందుకు లాక్కుంది కౌసల్య. నోరు నొక్కుకుని రోదించింది. కాస్సేపటికి చేతులు జోడించి నమస్కరిస్తూ, దశరథుని ఒడిలో వాలిపోయిందామె. మరింతగా కన్నీరుపెట్టుకుంది."రాముడు అరణ్యాలకు వెళ్ళిపోయి అయిదురోజులయిందయ్యా! ఈ అయిదు రోజులూ అయిదుయుగాలనిపించాయి. బాధను తట్టుకోలేక, కట్టుకున్న భర్తవని, మహారాజవని కూడా చూడక నిన్ను నానా మాటలూ అన్నాను. తప్పునాదయ్యా! నువ్వు నన్ను క్షమించాలి." అన్నది కౌసల్య. దశరథుని పాదాల మీద వాలిపోయింది. సూర్యాస్తమయం అయింది అప్పటికి. చీకట్లు ముసురుకున్నాయి. పత్నులూ, పరిచారికలంతా దశరథుణ్ణీ, కౌసల్యనీ లేపి, శయనమందిరానికి చేర్చారు. అక్కడ విశ్రమింపచేశారు. అర్ధరాత్రి అయింది. అయినా నిద్రలేదు దశరథునికి. అతనికి మునికుమారుని మరణం పదేపదే గుర్తుకు రాసాగింది. దృశ్యాలు దృశ్యాలుగా కనిపించసాగిందది.



లేచి కూర్చున్నాడు దశరథుడు. అటు తిరిగి మాగన్నుగా ఉన్న కౌసల్యను తట్టిలేపాడు."ఏంటి మహారాజా" అడిగింది కౌసల్య. లేచి కూర్చుంది."మనం చేసిన మంచి చెడుల ఫలితాలను మనం అనుభవించక తప్పదు దేవీ, తప్పదు." అన్నాడు దశరథుడు. ఆర్తిగా చూసింది కౌసల్య."పాపం చేశాను దేవీ, చేయరాని పాపం చేశాను. ఆ పాపం ఇప్పుడు నన్ను కట్టికుడుపుతోంది." అన్నాడు."ఏం చేశారు స్వామీ?""అప్పటికి మనకింకా పెళ్ళి కాలేదు దేవీ! నేను యువరాజుని. శబ్దవేధి విద్య నేర్చుకున్నానప్పుడే.""శబ్దవేధి?""శబ్దం వచ్చిన చోటును గురిపెట్టి కొట్టగల విద్యను శబ్దవేధి అంటారు దేవీ. ఆ విద్యలో ఆరి తేరానన్న అహంకారంతో ఓ సాయంకాలం వేటకి సరయూతీరం చేరాను.""రాత్రివేళ వేటా? పైగా నదీతీరంలో?" ఆశ్చర్యపోయింది కౌసల్య. "అవునుదేవీ! నదీతీరంలో, చీకటిలో ధనుస్సు ఎక్కుపెట్టి, మాటుగా ఉండి, మృగాలకోసం ఎదురుచూడసాగాను. అర్ధరాత్రి, బుడబుడమని నీటి శబ్దం వినవచ్చింది. తొండంతో నీరు తాగుతూ, ఏనుగు చేస్తున్న శబ్దం అనుకున్నానది. బాణాన్ని గురిపెట్టి వదిలాను. వెంటనే 'దేవుడా' అన్న ఆర్త నాదం వినవచ్చింది. మనిషి మాట విని పరిగెత్తాను. పరిగెడుతోంటే ఎవరిదో గొంతు బాధగా వినిపిస్తూనే ఉంది.'అర్ధరాత్రి! అడవిప్రాంతం! మనుషులు తిరిగే వేళ కాదు! ఈ వేళలో ఇంత మంచినీరు తీసుకుపోదామని నదీతీరానికి వస్తే ఎంత దెబ్బ తీశావయ్యా? నాకు తెలిసీ నేనెవరికీ ఎలాంటి అపకారమూ ఎన్నడూ చేయలేదు. అలాంటి నాకు అపకారాన్ని తలపెట్టావే, ఎవరయ్యా నువ్వు? ఏం ఆశించి నన్ను చంపావు?'కాళ్ళకి ఏదో చుట్టుకుంది. పరిగెత్తనీయడం లేదు. వంగి, తీసి చూశాను. ఏదో పాము, దూరంగా విసిరేశాను దాన్ని. మళ్ళీ పరుగందుకున్నాను. 'నిష్కారణంగా మరణిస్తున్నాను.

(మిగతా రేపటి సంచికలో)

# నిద్రతో చిన్నారులలో జ్ఞాపకశక్తి

నిద్ర అలసిన శరీరానికి ఉపశమనం ఇస్తుంది. రోజుకు ఎన్ని గంటలు నిద్రపోతే ఆరోగ్యకరంగా, ఆనందంగా ఉంటారన్న విషయాలపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. తాజాగా యూరప్‌లోని వార్విక్ యునివర్సిటీ పరిశోధకులు చిన్నారుల నిద్ర వారిలో మేధాశక్తికి ఎంత మేరకు దోహదం చేస్తుందన్న విషయంపై పరిశోధనలు నిర్వహించారు. చిన్నారులు కంటినిండా నిద్రపోకుంటే వారిలో మేధాశక్తి ఆశించిన మేరకు పెరగదనీ, నిద్ర వల్ల మెదడులో నిర్మాణాత్మక మార్పులు జరుగుతాయని వారు గుర్తించారు. తక్కువ సమయం నిద్రపోయే వారిలో మేధాశక్తి తగ్గడంతో పాటు మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు. వీరు 9 నుంచి 11 సంవత్సరాల వయసు కలిగిన పదకొండువేల మంది చిన్నారులపై పరిశోధనలు



నిర్వహించారు. వాళ్ళు రోజూ ఎంత సేపు నిద్రపోతున్నారు? వారి తెలివితేటలు ఏ విధంగా పెరుగుతున్నాయి? మేధాశక్తిలో ఎలాంటి మార్పులు జరుగుతున్నాయి? అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేశారు.

# వీటిని కలిపి తినవద్దు!





పొత్తు కుదరని పదార్థాలు కలిపి తినడం వల్ల జీర్ణసంబంధ సమస్యలు తలెత్తుతాయి. పుల్లని త్రేన్పులు, కడుపు ఉబ్బరం, అపానవాయువు లాంటి ఇబ్బందులూ తప్పవు. ఇలా జరగకుండా ఉండాలంటే కలిపి తినకూడని పదార్థాలేవో తెలుసుకుని, జాగ్రత్తపడాలి! మాంసం, పాల ఉత్పత్తులు, చేపలు, వెన్న లేదా మీగడ కలిపి తినకూడదు. అలాగే పాలు, గుడ్లు కలిపి తినకూడదు.పండ్లు, ఇతర ఆహార పదార్థాలు కలిపి తినకూడదు. ఇలా తినడం వల్ల జీర్ణకోశంలో వాయువులు తయారయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి పండ్లు ఖాళీ కడుపుతో తినాలి. పండ్లు తిన్న రెండు గంటల తర్వాతే ఇతర పదార్థాలు తీసుకోవాలి. చల్లని, వేడి పదార్థాలు వెంటవెంటనే తీసుకోకూడదు. పెరుగు, కాఫీ, లేదా ఐస్‌క్రీమ్, టీ... ఇలా రెండూ వెంటవెంటనే తీసుకోకూడదు. అలాగే భోజనం చేసే సమయంలో చల్లని నీరూ తాగకూడదు. ఇలా చేస్తే జీర్ణాగ్ని చల్లారిపోయి జీర్ణక్రియ కుంటుపడుతుంది. తేనెను ఎట్టి పరిస్థితుల్లోనూ వేడి పదార్థాల్లో కలిపి తినకూడదు. టీలో తేనె కలుపుకొని తాగుతూ ఉంటాం. కొందరు పాలలో తేనె కలుపుకొని తాగుతూ ఉంటారు. ఇలా వేడి పదార్థాల్లో తేనెను కలిపినప్పుడు తేనెలో కలిసి ఉండే మైనం విషంగా మారే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ పద్ధతిని మానుకోవాలి.









# ఈ సారి స్టైలిష్ డైరెక్టర్‌తో



అక్కినేని వారసుడు అఖిల్ అక్కినేని హీరోగా ఎంట్రీ ఇచ్చి మూడు సినిమాలు చేసినప్పటికీ విజయం మాత్రం అందుకోలేకపోయాడు. కమర్షియల్ డైరెక్టర్ వివి వినాయక్ దర్శకత్వంలో చేసిన మొదటి సినిమా అఖిల్ బాక్సాఫీసు వద్ద తేలిపోయింది. ఆ తర్వాత ప్రేమకథా చిత్రమైన హలో ప్రేక్షకులని మెప్పించలేకపోయింది. మిస్టర్ మజ్ను కూడా అంతగా ఆడలేదు. దాంతో ఈ సారి బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో మోస్ట్ ఎలిజబుల్ బ్యాచలర్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాపై అఖిల్ బాగా నమ్మకం పెట్టుకున్నాడు.కరోనా కారణంగా ఈ సినిమా రిలీజ్ వాయిదా పడింది. కరోనా తగ్గి, థియేటర్లు తెర్చుకున్నాక ఈ సినిమా విడుదల అవుతుందట. పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా హిట్ అవుతుందనే నమ్మకం అభిమానులకి కూడా ఉంది. అయితే ఈ సినిమా అనంతరం అఖిల్ ఎవరి దర్శకత్వంలో నటిస్తాడనేది ఇంతవరకూ ప్రకటించలేదు. తాజా సమాచారం ప్రకారం అఖిల్ ఈ సారి టాలీవుడ్ స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి దర్శకత్వంలో సినిమా చేయనున్నాడట. సైరా తర్వాత సురేందర్ రెడ్డి స్టార్ హీరోల కోసం వెతుకుతూనే ఉన్నాడు. ప్రస్తుతం పెద్ద హీరోలందరూ రెండు మూడు సినిమాలతో బిజీగా ఉన్నారు. సో ప్రస్తుతం సురేందర్ రెడ్డి సంధిగ్ధంలో ఉన్నాడు.

# సువర్ణ కాస్త యామిని అయ్యిందే...



వరల్డ్ ఫేమస్ లవర్ ఇంకా కౌసల్య కృష్ణమూర్తి చిత్రాలతో పాటు ఇప్పటి వరకు ఐశ్వర్య రాజేష్ నటించిన దాదాపు అన్ని సినిమాల్లో కూడా డీ గ్లామర్ పాత్రల్లోనే కనిపించింది. ఎక్స్ పోజింగ్ కాని స్కిన్ షో చేయడం కాని రొమాంటిక్ సీన్స్ లో కూడా ఇప్పటి వరకు ఆమె నటించలేదు. కాని మొదటి సారి ఆదిశగా ఐశ్వర్య అడుగులు వేస్తుందా అనే అనుమానం కలుగుతుంది. వరల్డ్ ఫేమస్ లవర్ చిత్రంలో సువర్ణ పాత్రలో పక్కింటి అమ్మాయిలా అనిపించిన సువర్ణ తాజా సోషల్ మీడియా పిక్స్ చూస్తుంటే అదే సినిమాలో అల్ట్రా మోడ్రన్ అమ్మాయిగా కనిపించిన యామిని మాదిరిగా మారిందనిపిస్తుంది.హాట్ ఫొటో షూట్స్ తో వరుసగా ఐశ్వర్య రాజేష్ రెచ్చిపోయింది. వరుసగా ఈమె పోస్ట్ చేసిన పిక్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. ఇప్పటి వరకు జిడ్డు ఫేస్ తో తలకు ఆయిల్ పెట్టి సాదా సీదాగా కనిపిస్తూ వచ్చిన ఐశ్వర్య రాజేష్ బాలీవుడ్ ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా రచ్చ హాట్ ఫొటో షూట్ తో బయటకు వచ్చింది. ఇకపై సినిమాల్లో కూడా ఇదే స్థాయి గ్లామర్ ఉంటుందా అనేది చూడాలి. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో రెండు మూడు సినిమాలతో పాటు తమిళంలో పలు సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. ఇకపై ఐశ్వర్య రాజేష్ ను వెండి తెరపై మెరుపులు మెరిపించే అందాలతో చూస్తామేమో చూడాలి.

# అనుష్క నిశ్శబ్దం రిలీజ్ పై మెజారిటీ అభిప్రాయం...




బాహుబలి తర్వాత అనుష్క చేస్తున్న సినిమాలన్నీ లేడీ ఓరియంటెడ్ చిత్రాలే. సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్దం.. ఇలా వరుసపెట్టి లేడీ ఓరియంటెడ్ చిత్రాలనే ఒప్పుకుంటుంది. అయితే నిశ్శబ్దం సినిమా ఇంకా రిలీజ్ కాలేదు. కరోనా కారణంగా ఈ సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడింది. అప్పటి నుండి ఈ సినిమాపై రకరకాల ఊహాగానాలు బయటకి వచ్చాయి. ఓటీటీలో రిలీజ్ చేసే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలని ఖండించిన చిత్ర నిర్మాత కోన వెంకట్ నిశ్శబ్దం సినిమాని థియేటర్లోనే రిలీజ్ చేస్తామని, ఇండస్ట్రీలోకి ఎంతో కష్టపడి వచ్చామని, సినిమా థియేటర్లలో రిలీజైతేనే అందరికీ బాగుంటుందని ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. అయితే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కరోనా ఇప్పట్లో తగ్గేలా కనబడట్లేదు. అన్ లాక్ దశలో ఉన్నా కూడా థియేటర్లు మాత్రం తెరుచుకునే అవకాశం కనిపించట్లేదు.దీంతో నిశ్శబ్దం టీమ్ పునరాలోచనలో పడినట్లుంది. అందుకే నిశ్శబ్దం సినిమాని ఎక్కడ చూడాలనుకుంటున్నారని ఓటింగ్ పోల్ పెట్టారు. మొత్తం 18వేల మంది ఆ పోల్ లో పాల్గొనగా 56శాతం మంది ఓటీటీలో రిలీజ్ చేయాలని కోరారు. 29శాతం మాత్రమే థియేటర్లలో చూస్తామని అన్నారు. మిగతా శాతం ఎలా అయినా ఫర్లేదని ఓట్ చేసారు. మరి మెజారిటీ అభిప్రాయాన్ని పరిగణలోని తీసుకుని నిశ్శబ్దం సినిమాని ఓటీటీలో రిలీజ్ చేస్తారో లేదో చూడాలి.

# బాలయ్య కోసం బాలీవుడ్ పవర్ఫుల్ విలన్..




నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బోయపాటి దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. సింహా, లెజెండ్ వంటి బాక్సాఫీస్ హిట్స్ అనంతరం వీరి కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. కానీ వీరిద్దరి గత సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచిన విషయం తెలిసిందే. అందుకే అంచనాలకు ఏ మాత్రం తక్కువ కాకుండా సినిమాను రెడీ చేస్తున్నారు.సినిమాకు మోనర్క్ అనే టైటిల్ కూడా సెట్ చేసినిట్లు టాక్ వచ్చింది కానీ చిత్ర యూనిట్ ఇంకా ఆ విషయంలో ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. అసలు మ్యాటర్ లోకి వస్తే.. సినిమాకు సంబంధించిన ఒక ఇంట్రెస్టింగ్ గాసిప్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బోయపాటి విలన్స్ ని ఏ రేంజ్ లో ప్రజెంట్ చేస్తాడో స్పెషల్ గా చెప్పనవసరం లేదు. సినిమాలు ఫ్లాప్ అయినా కూడా విలన్స్ విషయంలో మాత్రం మంచి మార్కులే అందుకున్నాడు.అయితే బాలయ్య సినిమా కోసం బోయపాటి బాలీవుడ్ స్టార్ ని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఆ యాక్టర్ మరెవరో కాదు. వినయ విధేయ రామ సినిమాలో విలన్ గా చేసిన వివేక్ ఒబేరాయ్. రక్త చరిత్ర సినిమాతోనే తెలుగు ఆడియెన్స్ లో వివేక్ మంచి క్రేజ్ అందుకున్నాడు. మళ్ళీ చాలా కాలం తరువాత రామ్ చరణ్ సినిమాలో విలన్ గా చేశాడు. అయితే సినిమా దారుణమైన ఫలితాన్ని అందుకుంది. ఇక మరోసారి అతనినే విలన్ గా సెట్ చేసుకోవాలని బోయపాటి నిర్ణయం తీసుకోగా బాలకృష్ణ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.



# మహేష్ బాబు, దేవిశ్రీ ప్రసాద్‌లకు శృతిహాసన్ కృతజ్ఞతలు



సూపర్ స్టార్ మహేష్ బాబు మూడు రోజుల క్రితం తన 45వ పుట్టినరోజును జరుపుకున్న సంగతి తెలిసిందే. పుట్టినరోజు నాడు ఆయన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు. తన అభిమానులంతా ఈ మంచి కార్యక్రమంలో పాల్గొని దీన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. అలాగే, ఈ ఛాలెంజ్‌కు తమిళ స్టార్ హీరో విజయ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్, హీరోయిన్ శృతిహాసన్‌ను నామినేట్ చేశారు. ఇప్పటికే విజయ్ ఈ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు. ఇప్పుడు శృతిహాసన్ కూడా మహేష్ ఛాలెంజ్‌ను స్వీకరించి మొక్కలు నాటారు. నిజానికి మహేష్ బాబు కన్నా ముందే ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్.. శృతిహాసన్‌కు గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విసిరారు. అందుకే, తనను ఈ ఛాలెంజ్‌కు నామినేట్ చేసినందుకుగాను మహేష్ బాబుతో పాటు దేవిశ్రీ ప్రసాద్‌కు శృతిహాసన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటుతోన్న ఫొటోలను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ ఛాలెంజ్‌ను తాను బాలీవుడ్ యాక్షన్ హీరో హృతిక్ రోషన్, కొత్త పెళ్లికొడుకు రానా దగ్గుబాటి, మిల్కీ బ్యూటీ తమన్నాకు విసురుతున్నట్టు శృతిహాసన్ పేర్కొన్నారు. శృతిహాసన్ ట్వీట్‌కు సూపర్ స్టార్ స్పందించారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను స్వీకరించినందుకు శృతిహాసన్‌ను అభినందించారు. ఈ మంచి పని మరింత ముందుకు వెళుతున్నందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాగా, మహేష్ విసిరిన ఛాలెంజ్‌ను స్వీకరించడంలో మిగిలింది ఇక ఎన్టీఆర్ మాత్రమే. ఆయన కూడా త్వరలోనే మొక్కలు నాటి ఈ ఛాలెంజ్‌ను పూర్తిచేయొచ్చు. దీని కోసం ఆయన అభిమానులు వేచి చూస్తున్నారు. ఇదిలా ఉంటే, గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖులతో పాటు ఇతర సినీ పరిశ్రమల్లోని స్టార్ల నుంచి కూడా మద్దతు లభిస్తోంది.

# ఓటీటీకి ససేమిరా అంటున్న యువ సామ్రాట్...?

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం “లవ్ స్టోరీ” సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ‘ఫిదా’ బ్యూటీ సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని ఏసియన్ సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై నారాయణదాస్ కె నారంగ్ మరియు పుష్కర్ రామ్మోహన్ రావ్ కలిసి నిర్మిస్తున్నారు. సున్నితమైన ప్రేమకథలని ఎంతో అందంగా ఆవిష్కరించే శేఖర్ కమ్ముల మరోసారి తన మ్యాజిక్ ని రిపీట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ‘లవ్ స్టోరీ’ ప్రచార చిత్రాలు చూస్తుంటే ఈ విషయం అర్థం అవుతోంది. కరోనా కారణంగా ఆగిపోయిన షూటింగ్ ఇటీవలే తిరిగి ప్రారంభం అయింది. కాగా మెజారిటీ భాగం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ‘లవ్ స్టోరీ’ మిగతా షూటింగ్ ఈ నెలలోనే కంప్లీట్ చేస్తారని తెలుస్తోంది. థియేటర్స్ ఎప్పుడు రీ ఓపెన్ చేస్తారో అనే క్లారిటీ లేకపోవడంతో ఈ మధ్య సినిమాలు ఓటీటీలో విడుదల అవుతున్న నేపథ్యంలో.. చైతూ సినిమాని కూడా ఓటీటీలో రిలీజ్ చేస్తారంటూ రూమర్స్ వచ్చాయి. ప్రముఖ ఓటీటీ ‘లవ్ స్టోరీ’ సినిమాకి రూ.35 కోట్ల




వరకు చెల్లించడానికి ముందుకు వచ్చిందని వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయంపై మేకర్స్ హీరో నాగచైతన్య ని సంప్రదించగా ఓటీటీ రిలీజ్ కి ససేమిరా అన్నట్లు ఫిలిం సర్కిల్స్ లో అనుకుంటున్నారు. ఎంత ఆఫర్ చేసినా.. ఎంత లేట్ అయినా ‘లవ్ స్టోరీ’ ని థియేటర్స్ లోనే రిలీజ్ చేయాలని చైతన్య కోరుతున్నాడట. దీంతో మేకర్స్ ఈ సినిమాని సంక్రాంతి బరిలో నిలిపే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# నానీకి కీర్తి నో చెప్పిందా..?



కీర్తి సురేష్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన కొత్తల్లో నానితో ‘నేను లోకల్’ సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి హిట్ కూడా. కానీ ఇప్పుడు కీర్తి సురేష్, నాని సినిమాకి నో చెప్పినట్టుగా ఫిలింనగర్ టాక్. ‘మహానటి’ తర్వాత కీర్తి సురేష్ వరుస ఫ్లాప్స్‌తో బాధపడి.. తర్వాత బాగా బరువు తగ్గించి పర్ఫెక్ట్‌గా రంగంలోకి దిగింది. మహానటి ముందు సరైన పాత్రలు ఎంచుకోకపోవడం వలనే కీర్తి సురేష్‌కి మహానటి తర్వాత విడుదలైన సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. తర్వాత కీర్తి సురేష్ ఆచి తూచి సినిమాలు ఎంపిక చేసుకుంటుంది. తాజాగా మహేష్ బాబుతో ఏకంగా ‘సర్కారు వారి పాట’లో అవకాశం పట్టేసింది. అలాగే నితిన్ ‘రంగ్ దే’, ‘మిస్ ఇండియా’తో పాటుగా తమిళ సినిమాల్లో నటిస్తున్న కీర్తి సురేష్ ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో నానితో కలిసి నటించేందుకు నో చెప్పింది అనే టాక్ నడుస్తుంది. నాని - వివేక్ ఆత్రేయ కాంబోలో తెరకెక్కబోయే సినిమా కోసం వివేక్ ఆత్రేయ కథతో కీర్తిని సంప్రదించాడని.. అయితే కీర్తి కథ విన్నాక నాని సినిమాకి నో చెప్పిందని అంటున్నారు. పాత్ర నచ్చితేనే సినిమా ఒప్పుకుంటున్న కీర్తికి వివేక్ ఆత్రేయ ఎలాంటి కథ చెప్పాడో.. కీర్తి పాత్రకి ఇంపార్టెన్స్ లేకపోవడం వలనే కీర్తి ఈ సినిమాకి నో చెప్పి ఉండొచ్చు అనే టాక్ మాత్రం స్ప్రెడ్ అయ్యింది.

# స్టార్ హీరోయిన్ మళ్లీ తల్లి కాబోతుంది



బాలీవుడ్ స్టార్ కపుల్ సైఫ్ అలీ ఖాన్ కరీనా కపూర్ ఖాన్‌లు మరోసారి తల్లిదండ్రులు కాబోతున్నారు. వీరిద్దరు మూడు సంవత్సరాల క్రితం తైమూర్ కు జన్మనిచ్చిన విషయం తెల్సిందే. ఆ బాలుడు పెద్ద వాడు అవుతూనే ఉన్నాడు. అతడికి సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. తైమూర్ కాస్త పెద్దవాడు అవ్వడంతో ఈమధ్యే కరీనా కపూర్ సినిమాల్లో నటించడం మొదలు పెట్టింది. అప్పుడే ఆమె మళ్లీ తల్లి కాబోతుంది అంటూ వార్తలు రావడం మొదలయ్యాయి.చాలా మంది ఆ వార్తలు నిజం కాదనుకున్నారు. కరీనా కపూర్ తండ్రి రణదీర్ కపూర్ కూడా మీడియాలో వస్తున్న ఆ వార్తలు నిజం అయితే బాగుండు. తైమూర్ కు చెల్లి లేదా తమ్ముడు రావాలని నేను కూడా అనుకుంటున్నాను అంటూ పోస్ట్ చేశాడు. రణదీర్ కపూర్ సోషల్ మీడియాలో ఆ పోస్ట్ పెట్టిన కొద్ది సేపటికే సైఫ్ అలీ ఖాన్ ఇన్ స్టాగ్రామ్ లో తమ ఫ్యామిలీలోకి మరొకరు రాబోతున్నారు. అభిమానులకు మరియు బంధు మిత్రులకు కృతజ్ఞతలు అంటూ సైఫ్ పోస్ట్ పెట్టాడు. సైఫ్ అలీ ఖాన్ పోస్ట్ తో కరీనా కపూర్ రెండవ సారి తల్లి కాబోతుందనే విషయంపై క్లారిటీ వచ్చేసింది. ప్రస్తుతం ఈమె అమీర్ ఖాన్ తో లాల్ చద్దా చిత్రంలో నటిస్తోంది. ఆ సినిమా ఇంకా పూర్తి కాలేదు.



# మరో ఛాలెంజింగ్ రోల్‌లో..

మన టాలీవుడ్ లో తెలుగు వచ్చిన అతి తక్కువ మంది హీరోయిన్స్‌లో ఈషా రెబ్బా కూడా ఒకరు. ఇప్పటికే ఎన్నో చిత్రాల్లో నటించిన ఈ తెలుగు బ్యూటీ ఈ మధ్య కాలంలో పలు వెబ్ సిరీస్ లకు కూడా ఒకే చెప్పిన సంగతి తెలిసిందే. ఇటీవలే కాలంలో డిజిటల్ రంగం ఏ స్థాయిలో అభివృద్ధి చెందిందో అందరికీ తెలిసిందే.అందులో ముఖ్యంగా వెబ్ సిరీస్ లకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీనితో అనేక స్టార్ నటులు కూడా వెబ్ సిరీస్ లలో నటించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అలా హిందీలో హిట్ అయిన “లస్ట్ స్టోరీస్” రీమేక్ వెబ్ సిరీస్ లో ఈసా ఒప్పుకునేందుకు అంగీకరించింది.అది నిజంగానే ఒక ఛాలెంజింగ్ రోల్ ఇపుడు మళ్ళీ అదే తరహాలో ఒక డార్క్ రోల్ లో ఈషా కనపడనున్నట్టు తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సంపత్ నంది ప్రిపేర్ చేస్తున్న ఓ వెబ్ సిరీస్ కు గాను ఈషానే మెయిన్ లీడ్ అన్నట్టు తెలుస్తుంది. ఈ రోల్ చాలా బోల్డ్ మరియు డార్క్ గా ఉంటుందట. మరి ఈ వెబ్ సిరీస్ ఎలా ఉండనుండో చూడాలి.

# తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప



## స్టాకు పాయింట్లలో ఇసుక నిల్వలను పెంచాలి: కలెక్టర్ హరికిరణ్



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 19 :** జిల్లాలో అందుబాటులో ఉన్న ఇసుక రీచుల నుండి అధిక మొత్తంలో ఇసుకను సేకరించి స్టాక్ పోయింట్లలో నిల్వ ఉంచాలని జిల్లా కలెక్టర్ సి.హరికిరణ్ సంబందిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్ సి) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. వర్షాకాలం దృష్ట్యా వినియోగదారులకు ఎలాంటి కొరత లేకుండా జిల్లాలోని అన్ని ఇసుక డిపోలలో నిల్వలు పెంచేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఇసుక అధికారులకు సూచించారు. గండికోట రిజర్వాయర్ పునరావాస కాలనీల నిర్మాణం కోసం భారీ స్థాయిలో ఇసుక అవసరం ఉంటుందని.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రధానంగా సి.కె.దిన్నె, కడప ఇసుక డిపోలలో ఇసుకను పూర్తి స్థాయిలో నిల్వ ఉంచేలా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇసుక డోర్ డెలివరీ నిర్వహణను నిరంతరాయంగా సాగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కలెక్టర్ వికాస్ మర్మాట్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఎన్ఫోర్సుమెంటు డిఎస్పీ చెంచుబాబు, మైన్స్ శాఖ ఇంచార్జి డిడి ఓబుల్ రెడ్డి, ఎడి (శాండ్) రవి ప్రసాద్, భూగర్భజల శాఖ డిడి మురళీధర్, హౌసింగ్ పిడి రాజశేఖర్, ఆర్టీఓ శాంత కుమారి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం



**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 19 :** కోవిడ్ 19 దెబ్బకి దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. చాలా మంది ఉపాధి కోల్పోయారు. ఉద్యోగుల వేతనాల్లో కోతలు పడ్డాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఊరట కలిగే నిర్ణయం తీసుకుంది. ఉచితంగానే గ్యాస్ సిలిండర్లు అందిస్తోంది.ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలిండర్లను ఆఫర్ చేస్తోంది. ఈ బెనిఫిట్ సెప్టెంబర్ 30తో ముగిసిపోనుందిఉజ్వల స్కీమ్ కింద చేరాలంటే మహిళలు బీపీఎల్ కుటుంబానికి చెంది ఉండాలి. వీరికి మాత్రమే ఈ స్కీమ్ కింద కొత్త గ్యాస్ కనెక్షన్ తీసుకోవడం వీలవుతుంది. మీరు డైరెక్ట్‌గా pmujjwalayojana.com వెబ్‌సైట్‌కు వెళ్లి రిజిస్టర్ చేసుకోవచ్చు.

## కొండేక్కిన కూరగాయల ధరలు



**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 19 :** నెల్లూరు కార్పొరేషన్ పరిధి లోని కూరగాయల మార్కెట్ లో పొంతన లేని ధరలు, ధరల పట్టిక వివరాలు లేకుండానే వ్యాపారాలు కొనసాగిపోతున్నా అధికారులు మాత్రం మౌనం పాటిస్తూ ఉన్నారు. షాపు షాపుకు ధరల్లో తీవ్రంగా వ్యత్యాసం ఉండటం తో పాటు కూరగాయలు ధరలు పెరగటంతో సామాన్యులు కొనలేని స్థితిలో లబోదిబోమంటున్నరు. కరోన కాలంలో పనులు లేక అనేక అవస్థలు పడుతున్న నిరుపేదలకు ధరలు పెరగడం ఒకింత బాధ కలిగించే విషయంగా పరిగణిస్తున్న పేద ప్రజలు ధరలో తేడాతో పాటు ధరల పట్టిక లో ధరల వివరాలు తెలుపకుండా వ్యాపారాలు చేస్తూ ప్రజల ను మోసగిస్తూ ఉన్నారని పలువురు ఆరోపిస్తూ ఉన్నారు. సంబంధిత అధికారులుస్పందించి ధరలను అదుపు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నీట మునిగిన వరద బాధితులను ఆదుకోవాలి



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 19 :** కార్పొరేషన్‌కు ముందస్తు సరైన ప్రణాళిక లేకనే నీటమునిగిన పేదల కాలనీలు. కడపలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సిపిఎం నాయకులు తుఫాను కారణంగా నిన్న రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా వరదనీటితో కడప నగరంలో పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఈ ప్రాంతాలను సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది .ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ రామ్మోహన్ మాట్లాడుతూ కార్పొరేషన్ కు సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇష్టారాజ్యంగా అక్రమంగా లేఅవుట్లు డ్రైనేజీ కాలువల ఆక్రమణ జరిగాయని తద్వారా లోతట్టు ప్రాంతాలన్నీ భారీ వర్షానికి నేడు జలమయం అయ్యాయి అని ఆయన తెలిపారు. కడప నగరంలో రామకృష్ణ నగర్ దండోర కాలనీ బుడగ జంగం కాలనీ, ఎన్జీవో కాలనీ, బహుజన నగర్, అప్సర సర్కిల్ ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ప్రాంతాలన్నీ చెరువును తలపించే విధంగా వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది అన్నారు. కడప నగరంలో పెండింగ్లో ఉన్న అస్తవ్యస్తంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నేడు నిలిచిపోవడంతో ఈ సమస్య ఉత్పన్నం అయిందని ఆయన తెలిపారు. నగరంలో మౌలిక వసతులు కల్పించకుండా నగర కార్పొరేషన్ ప్రజల పైన అన్ని రకాల పన్నులు వసూలు చేసుకుని వ్యాపార సంస్థ గా మారిందని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, నీట మునిగిన కాలనీలకు అన్ని విధాలుగా ప్రజలను ఆదుకోవాలని, నష్టపోయిన వాటికి నష్టపరిహారం ఇవ్వాలని, లోతట్టు ప్రాంతాలలో నిలిచిన వరద నీటిని బయటకు పంపేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, పాపిరెడ్డి,కడప నగర నాయకులు పి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీధి వీధికి సిమెంటు రోడ్లు డ్రైనేజీ కాలువలు

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్‌భాష



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 19 :** కడప పట్టణంలోని వీది వీధికి సిమెంట్ రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్వహించి పట్టణాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని రాష్ట్ర ఉపము ఖ్యమంత్రి వర్యులు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్బి అంజాద్బాష పేర్కొన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి వర్యులు మాజీ మేయర్ సురేష్ బాబు తో కలిసి సబ్ జైల్, శ్రీరామ్ నగర్ లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లా డుతూ రాబోయే నాలుగు సంవత్సరాలలో ప్రతి వీధికి సిమెంట్ రోడ్డు డ్రైనేజీ కాలువలు, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 8.5 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎర్రముక్కపల్లి సర్కిల్ నందు నూతనంగా ఏర్పాటుచేసిన రాయని ఏజెన్సీస్, విమ్ ఎలక్ట్రానిక్స్ హోమ్ నీడ్స్ ను ఉప ముఖ్యమంత్రి వర్యులు, మాజీ మేయర్ సురేష్ బాబు లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 3 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్టర్ కృష్ణారెడ్డి, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, వైసిపి నాయకులు సుభాన్ భాష, తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలకు భయపడి నలుగురు విద్యార్థులు ఆత్మహత్య



**చెన్నై:** తమిళనాడులో నీట్ పరీక్షలకు భయపడి నలుగురు విద్యార్థులు ఆత్మ హత్య చేసుకున్న ఘటనపై తమిళ సినీ నటుడు సూర్య చేసిన వ్యాఖ్యలపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాల్సిన అవసరం లేదని, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఆచితూచి విమర్శలు చేయాలంటూ సూర్యకు సూచించింది. న్యాయవ్యవస్థను కించపరిచే విధంగా ఉన్నాయని, సూర్యపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎం. సుబ్రహ్మణ్యం.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ సాహికి లేఖ రాశారు. అయితే సూర్య వ్యాఖ్యలకు మద్దతుగా ఆరుగురు మాజీ న్యాయమూర్తులు కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయొద్దంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారు.

## త్వరలో బుగ్గవంక సుందరీకరణ పనులు ప్రారంభం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్ బాషా



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 19 :** త్వరలో బుగ్గవంక సుందరీకరణ పనులు ప్రారంభించి బుగ్గ వంక పరిసర ప్రాంత ప్రజల శాశ్వత సమస్య పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్బాష పేర్కొన్నారు. శని వారం ఉప ముఖ్యమంత్రివర్యులు మాజీ మే యర్ సురేష్ బాబు తో కలిసి బుగ్గవంక లోతట్టు ప్రాంతాలు నాగరాజుపేట, రవీంద్రన గర్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సంద ర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడు తూ గత నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షంతో కడప చుట్టుపక్కల కొండల్లో నుంచి వచ్చిన వర్షపు నీటితో బుగ్గవంక ప్రాజెక్టు నిండిపోవడం జరిగిందన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నేటి ఉదయం ఏడు గంటలకు మూడు గేట్లు ఎత్తడం జరిగింద న్నారు. బుగ్గవంక ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బుగ్గవంక కాలవగుండా నీరు ప్రవహించి ప్రొటెక్షన్ వాల్ లేని ప్రాంతాలలో కొన్ని ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. గతంలో 2001 సంవత్సరంలో బుగ్గవంక ప్రాజెక్టు నిండినప్పు డు ఆకస్మాత్తుగా ఒక్కసారిగా గేట్లు తలెత్తడంతో కడప నగరం అంతా జలమయం అయిందన్నారు. దీంతో 20 నుంచి 30 రోజుల వరకూ ఈ ప్రాంత వాసులు అనేక ఇబ్బందు లు ఎదుర్కొన్నారన్నారు. కొంత మంది ప్రాణాలు కూడా కోల్పోయి ఆస్తి నష్టం కూడా జరిగిందన్నారు. అప్పటి ప్రతిపక్ష నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్రెడ్డి ఈ ప్రాంతమంతా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ లవన్న, డిఇ రాజేష్, వైయస్సార్ సిపి నాయకులు సుభాన్ భాష, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు' జరుగుతున్న విధానంపై మంత్రి మేకపాటి ఆకస్మిక తనిఖీ



**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 19 :** రాష్ట్ర పరిశ్రమలు, ఐ.టీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తన సొంత నియోజకవర్గం అయిన ఆత్మకూరులో పర్యటించారు. సంగం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిం చారు. శనివారం ఉద యాన్నే నెల్లూరు జిల్లాలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి న మంత్రి మేకపాటి ధాన్యం కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్య లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు, మద్దతు ధర, నాణ్యత ప్రమాణాల పరంగా రైతులకు మేలుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. నెల్లూరు జిల్లాకే ప్రత్యేకమైన ఎడగారు పంట ధాన్యం కొనుగోలులో ఎదురైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే మిల్లర్లతో సమీక్ష నిర్వహించి అన్ని విషయాలపై మాట్లాడామని ప్రభుత్వానికి సహకరిస్తామని వారు చెప్పినట్లు మంత్రి మేకపాటి వెల్లడించారు. ఒక వేళ అలా జరగని పక్షంలో ప్రభుత్వపరంగా కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులు బస్సు ప్రయాణాలు చేయొద్దని సూచిస్తున్నాం: రహదారులు, భవనాల శాఖ

**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 19 :**న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) అందించే రుణ సాయంతో రాష్ట్రంలో త్వరలోనే రహదారుల నిర్మాణ పనులు మొదలుపెడతామని రహదారులు, భవనాల ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు అన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. టెండర్లను పారదర్శకంగా నిర్వహించేందుకు జ్యుడీషియల్ ప్రివ్యూకి పంపి త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులు మొదలు పెట్టకపోతే నిధులు సరెండర్ చేయాలని కేంద్రం నిబంధన పెట్టిందన్న కృష్ణబాబు ఎన్ఐసి ప్లాట్‌ఫామ్ ద్వారా, గ్లోబల్ బిడ్డింగ్ ద్వారా టెండర్లు నిర్వహిస్తామని వెల్లడించారు. అయితే కొంతమంది కావాలనే దీని గురించి దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇ-టెండర్ తో పాటు 25 బిడ్స్ వచ్చాయని, ఇందుకు సంబంధించిన హార్డ్ కాపీలు కూడా అందాయని తెలిపారు. అదే విధంగా బిడ్డింగ్ దశలో కూడా ఎన్‌డీబీ అభిప్రాయం తీసుకున్నామన్న కృష్ణబాబు, ప్రపంచ బ్యాంకు సూచించిన నిబంధనల మేరకే అర్హత ప్రమాణాలను నిర్దేశించినట్లు తెలిపారు. కేవలం జాతీయ బ్యాంకుల ద్వారా సదరు సంస్థలు లావాదేవీలు చేయాలన్న నిబంధన మాత్రమే జ్యుడీషియల్ ప్రివ్యూ లో సూచించారని, టెండర్ల విషయంలో ఎలాంటి సందేహాస్పద లావాదేవీలు జరగలేదని స్పష్టం చేశారు. బిడ్ల నుంచి రివర్స్ టెండర్ల వరకు సంబంధించిన ప్రక్రియ అంతా కూడా ఏపీ ప్రభుత్వంతో పాటు ఎన్‌డీబీ పర్యవేక్షణలో సాగిందన్నారు. అయితే బిడ్లు ఇంత తక్కువగా ఎందుకు దాఖలు అయ్యాయన్న విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. విజయవాడ, వైజాగులో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సీటీ బస్సులను తిప్పుతున్నామన్నారు. 50 శాతం ఆక్యుపెన్సీతోనే బస్సులను నడుపుతామని, అయితే భారీగా నష్టం చేకూర్చే అంశంగా ఉంటుందన్నారు. అలాగే బస్సుల్లో స్టాడింగుకు అనుమతించడం లేదని, అందుకే వృద్ధులు బస్సు ప్రయాణాలు చేయొద్దని సూచిస్తున్నామన్నారు.

కానీ కొందరు అత్యవసర పరిస్థితులంటూ కొందరు వృద్ధులు వస్తున్నారని, వారి బస్ ప్రయాణాలను నిరుత్సాహపరిచేందుకే బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు ఇచ్చే రాయితీలను తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. అయితే సాధారణ పరిస్థితులు రాగానే సీనియర్ సిటీజన్లకు రాయితీని వర్తింపజేస్తామని కృష్ణబాబు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీకి కరోనా కారణంగా ఫ్లైఓవర్ ఓపెనింగ్ ఆగిందని కృష్ణబాబు వెల్లడించారు.

గడ్కరీ ప్రారంభించాకే ఫ్లైఓవర్‌పై రాకపోకలకు అనుమతిస్తామని తెలిపారు. ఇక అంతర్‌రాష్ట్ర సర్వీసుల గురించి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బస్ సర్వీసులను పెంచడానికి ఇష్టపడడం లేదని, ఏపీని తగ్గించుకోమని సూచిస్తోందన్నారు. తెలంగాణ సూచనల మేరకు సర్వీసులను తగ్గించుకోవడానికి సిద్దంగా ఉన్నా, ఏపీ తగ్గించుకునే 1.10 లక్షల కిలోమీటర్ల మేర రవాణను ప్రైవేట్ ఆపరేటర్లకు అవకాశం లభిస్తుందన్నారు.

ఏపీ తిప్పే సర్వీసుల కంటే డబుల్ సర్వీసులు తిప్పుతామని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. అయితే బెజవాడ-హైదరాబాద్ రూట్లో మాత్రమే డబుల్ సర్వీసులు తిప్పుతానంటోన్న తెలంగాణ.. మిగిలిన రూట్ల గురించి ప్రస్తావించడం లేదు అని కృష్ణబాబు తెలిపారు.



## త్వరలో బుగ్గవంక సుందరీకరణ పనులు ప్రారంభం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి. అంజాద్ బాషా





**కడప, వార్తావళి, సెప్టెంబర్ 19 :** త్వరలో బుగ్గవంక సుందరీకర ణ పనులు ప్రారంభించి బుగ్గ వంక పరిసర ప్రాంత ప్రజల శాశ్వత సమస్య పరిష్కరించ డం జరుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్బాష పేర్కొన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రివర్యులు మాజీ మేయర్ సురేష్ బాబు తో కలిసి బుగ్గవంక లోతట్టు ప్రాంతాలు నాగరాజుపేట, రవీంద్రనగర్ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ గత నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షం తో కడప చుట్టుపక్కల కొండల్లో నుంచి వచ్చిన వర్షపు నీటితో బుగ్గవంక ప్రాజెక్టు నిండిపోవడం జరిగిందన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై నేటి ఉదయం ఏడు గంటలకు మూడు గేట్లు ఎత్తడం జరిగిందన్నారు. బుగ్గవంక ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బుగ్గవంక కాలవగుండా నీరు ప్రవహించి ప్రొటెక్షన్ వాల్ లేని ప్రాంతాలలో కొన్ని ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. గతంలో 2001 సంవత్సరంలో బుగ్గవంక ప్రాజెక్టు నిండినప్పుడు ఆకస్మాత్తుగా ఒక్కసారిగా గేట్లు తలెత్తడంతో కడప నగరం అంతా జలమయం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లవన్న, డిఇ రాజేష్, వైయస్సార్ సిపి నాయకులు సుభాన్ భాష, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోలింగేశ్వరస్వామి దేవాలయం, బిక్కవోలు

పూర్వం బిరుదాంకుడు అనే రాజు కానేటి కోటలో వుండి ఈ ప్రాంతాన్నంతా పరిపాలించేవాడు. ప్రస్తుతం ఈ కోట పూర్తిగా శిథిలమై పోయింది. ఇప్పుడు మిగిలివున్నది ఆకోటలోని మహాలక్ష్మి అమ్మవారి గుడి మాత్రమే ఉంది. బిరుదాంక మహారాజు పాలనలో బిరుదాంకపురం బిక్కవోలులో 118 దేవాలయములు నిర్మించి 118 చెరువులు త్రవ్వించాడు.

**వీటిలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలు.**

శ్రీ గోలింగేశ్వర స్వామి దేవాలయం. శ్రీ కుమార సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం. శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం. శ్రీ విఘ్నేశ్వర ఆలయాలు. శ్రీ గోలింగేశ్వరస్వామి మొదట బిరుదాంకపురంలో మంద బయలు భూమిలో కప్పబడి వుండేది. గ్రామంలో ఉన్న ఓ రైతు యొక్క ఆవు ప్రతి నిత్యం తన పాలు ఈ లింగాకారం వున్న ప్రదేశంలో కార్చి వెళ్ళిపోయేది. రైతు ఆవు పాలు ఇవ్వక పోవడంతో అనుమానం పడి తన పాలికాపుని ఆవుని ఒక కంటకనిపెట్టి వుండమని చెప్పాడు. పాలికాపు ప్రతి రోజులాగే ఆవుల మందలో ఉన్న ఆవును వదిలాడు. తర్వాత పాలికాపు ఆ ఆవుని గమనించగా,ఆ ఆవు అక్కడక్కడ మేత వేస్తూ తిన్నగా లింగాకారంవున్న ప్రదేశానికి వచ్చి, అక్కడ పాలుకార్చిన తరువాత మేత మేస్తూ ప్రక్కలకు పోయింది. అది చూసిన పాలికాపు ఆ ప్రదేశానికి వెళ్ళి చూస్తే అక్కడ ఆవు కార్చిన పాలు ఉన్నాయి. ఆవులకాపరి సాయంకాలం దూడలను తిరిగి ఇండ్లకు తోలుకొచ్చి వాటి స్థానాల్లో వాటిని కట్టేసి తన రైతుకు జరిగింది అంతా చెప్పాడు. రైతు ఈ విషయాన్ని గ్రామంలోని వారికి చెప్పాడు. గ్రామస్థులు అంతా పాలుకార్చిన ప్రదేశానికి వెళ్ళి, అక్కడ పాలు కట్టిన చిన్నమడుగుని చూశారు. దానితో పాలు మడుగుకట్టిన భూమిలోపల ఏ దేవుడో, దేవతో ఉండవచ్చని భావించి గ్రామస్తులంతా మంచి ముహూర్తంలో అక్కడ త్రవ్వారు. అక్కడ పానవట్టంతో సహా లింగం బయటపడింది. బిరుదాంక మహారాజు గుడి కట్టించడానికి ముందుకొచ్చి పునాదులు త్రవ్వుతుంటే ఆ పునాదుల్లో పుట్టబయలుదేరింది. దాన్ని త్రవ్వితే కొద్ది మరోపుట్ట పుట్టింది. అలా ఎన్ని సార్లు త్రవ్వినా పుట్టపుట్టుకొస్తూనే వుంది. ఆ పుట్టను అలాగే వుంచి తిరిగి పునాదులు త్రవ్వుతుండగా కుమార సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహం బయటపడింది. మొదట బయల్పడిన లింగం నకు శ్రీ గోలింగేశ్వర స్వామి అని పిలిచారు. భారతదేశంలో కుమార సుబ్రమణ్యేశ్వర స్వామి వారి విగ్రహాలు రెండుచోట్ల మాత్రమే ఉన్నాయి. ఒకటి దక్షిణ దేశంలోని 'ఫలణి'లోను రెండవది బిరుదాంకపురంలో వెలిశారు.

**బిక్కవోలు ఎలా చేరుకోవాలి ?**

విమాన మార్గం బిక్కవోలుకు సమీపాన 39 కి. మీల దూరంలో రాజమండ్రి విమానాశ్రయం (దీనినే మధురపూడి విమానాశ్రయం అంటారు) కలదు. అక్కడి నుండి క్యాబ్ లేదా టాక్సీ లలో ఎక్కి బిక్కవోలు సులభంగా చేరుకోవచ్చు. రైలు మార్గం బిక్కవోలు లో రైల్వే స్టేషన్ కలదు. కాకినాడ, రాజమండ్రి నుండి రైళ్ళు వస్తుంటాయి అయినప్పటికీ బిక్కవోలు కి 10 కి.మీ ల దూరంలో ఉన్న సామర్ల కోట రైల్వే జంక్షన్ యాత్రికులకు సూచించదగినది. వైజాగ్, విజయవాడ, గుంటూరు, చెన్నై నుండి స్టేషన్ మీదుగా తరచూ రైళు ళ్ళ నడుస్తుంటాయి. రోడ్డు / బస్సు మార్గం రాజమండ్రి, కాకినాడ (31 కి.మీ) నుండి బిక్కవోలుకు తరచూ ప్రభుత్వ బస్సులు నడుస్తుంటాయి.






## వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### రైతు సంఘం డిమాండ్




**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** వ్యవసాయ రంగానికి గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ సరఫరా చేయగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిళ్లకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ బిగించాలని నిర్ణయించడం దుర్మార్గంఅని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదే శ్ రైతు సంఘం డిమాండ్ చేసింది శనివారం తుమ్మపాల ఆర్. ఈ .సి .ఎస్. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆఫీస్ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందజేసే కరెంట్ మీటర్లు వేయడం ఎందుకని ప్రశ్నించారు దీని వెనక ప్రభుత్వం కుట్ర దాగి ఉందని క్రమేపి ఈ విద్యుత్ వ్యవస్థను కార్పొరేట్ శక్తిలకు అప్పగించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటూ ప్రభుత్వం జీవో నెంబర్ 22న జారీ చేసిందన్నారు ఇది చాలా అన్యాయం అని వెంటనే ప్రభుత్వం సవరించుకొని కేంద్ర ప్రభుత్వం ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని రైతు సంఘం డిమాండ్ చేసింది అలాగే రైతులకు ఉచిత విద్యుత్తు ను 9 గంటలు ఉదయం పూట ఏకకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో రైతు సంఘంనాయకులు కొరిబిల్లి.శంకరరావు, వైఎన్.భద్రం, తులూరి. అప్పారావు, ఇంజరపు. విరచారి,చిన్ని. అప్పారావు, ఎమ్. సూరిబాబు, కోన.లక్ష్మణ, పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి



**శ్రీశైలం, వార్తావళి, సెప్టెంబర్ 19:** కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలానికి 2,11,543 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ఆరు గేట్లను పది అడుగుల మేరకు ఎత్తి 1,66,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం ప్రస్తుత నీటి మట్టం 884.20 అడుగులుగా ఉంది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసి లకుగాను ప్రస్తుతం 210.9946 టిఎంసిలు గా నమోదైంది.

**నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద**

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పొటెత్తుతుంది. మరోవైపు ఎగువ నుండి కూడా వరద ప్రవాహం వచ్చి చేరుతుండటంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 8 క్రస్ట్ గేట్లను 10 ఫీట్ల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0405 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 309.6546 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 1,54,878 క్యూసెక్కులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589.20 అడుగుల మేరకు నీటి మట్టం ఉంది.

## పెట్రోలు డీజిల్ ధరలపై సేస్ పెంచి ప్రజలపై 600 కోట్లు మోత

### ఎమ్మెల్సీ నాగ జగదీష్



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి సంక్షేమ పథకాలు ఇస్తూ మరో చేత్తో ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని విశాఖ రూరల్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు పెంచిన సేస్ ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ ఆర్థిక సంవత్సరంలో రెండుసార్లు పెట్రోలు డీజిల్ పై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల రూపంలో రెండు రూపాయలు పెంచారని మరలా ఇప్పుడు రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి చేయడానికి సాకుతో పెట్రోలు డీజిల్ పై లీటరుకు ఒక రూపాయి చొప్పున సేస్ విధించడం దుర్మార్గమైన చర్య అని ఈ నెల 3వ తేదీ క్యాబినెట్ మీటింగ్ లోనే ఆమోదం తెలిపారని అయితే వరుసగా పెంచుతున్న పనులు వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందని భావించి గోప్యంగా ఉంచిందని ఇప్పుడు రోడ్ డెవలప్మెంట్ సేస్ పేరుతో సంవత్సరానికి ఆరు వందల కోట్లు ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వ ఆలోచన చేస్తుంటే ఒక ప్రక్క సంక్షేమ అంటూనే మరోపక్క ప్రజలపై భారాలు వేయడం చూస్తుంటే ప్రజల పట్ల వైసీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లం అయిందని నాగ జగదీష్ అన్నారు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెంచిన పనులు చూసేందుకు రూపాయలు పైసల్ లో కనిపిస్తున్నా ప్రతి సంవత్సరం వాహనదారుల నుండి 1200 కోట్లు ప్రజల నుండి లాగేస్తున్నారు జూలైలో పెంచిన అదనపు వ్యాట్ వల్ల ఆరు వందల కోట్లు తాజాగా వేసిన సేస్ వల్ల 600 కోట్లు ప్రభుత్వం సమకూర్చుకుందని జగదీష్ తెలిపారు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతాయి అని పెంచిన ధరలను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని నాగ జగదీష్ డిమాండ్ చేశారు

## అన్నమయ్య డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం క్రిందికి నీటి విడుదల



**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 19:** కడప జిల్లా రాజంపేట చెయ్యేరు నదిపై నిర్మించిన అన్నమయ్య డ్యామ్ శనివారం నాటికి పూర్తి స్థాయి నీరు చేరింది .అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు.విడుదలైన వరద నీరు రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లో చెయ్యేరు నది గుండా ప్రవహిస్తుంది. కావున ప్రజలు, పరిసర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్యప్రాజెక్టు అధికారులు హెచ్చరిక జారీ చేశారు.అన్నమయ్య డ్యామ్ నిండడంతో రాజంపేట శాసన సభ్యులు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేడా వెంకట మల్లికార్జున రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు .ఇది శుభపరిణామమన్నారు.డామ్ అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు .ప్రధాన కాలువ గుండా అన్ని చెరువులకు నీరు విడుదల చేయాలని,వాటిని నింపాలని అధికారులను ఆదేశించారు .ఈ నీటిని వృధా కానీయకుండా చెరువులు నింపుకోవాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

## వైఎస్సార్సీపీ సూటిగా.. సుత్తి లేకుండా!



ఏపీ హై కోర్టు తీర్పు విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యాఖ్యలను కొనసాగిస్తూ ఉంది. రాజ్యసభలో ఇప్పటికే ఆ పార్టీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఏపీ హై కోర్టు నిస్పాక్షికతను శంకించగా, లోక్ సభలో ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి తెలుగుదేశం పార్టీ తరఫున లాయర్లుగా పని చేసిన వాళ్లే ఇప్పుడు జడ్జిలుగా మారి తీర్పులు ఇస్తున్నారంటూ ధ్వజమెత్తారు. 'ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వ్యవస్థ శాసన వ్యవస్థలోకి చొచ్చుకు వస్తోంది. తద్వారా శాసన వ్యవస్థ నిర్మాణం నెమ్మది నెమ్మదిగా నాశనం అవుతోంది. మా రాష్ట్రంలో టీడీపీ తరఫున వాదించిన న్యాయవాదులు న్యాయమూర్తుల య్యారు. ఇలాంటప్పుడు మా రాష్ట్రంలో నిష్పాక్షిక మైన తీర్పులు ఆశించలేం...' అంటూ మిథున్ రెడ్డి కుండబద్ధలు కొట్టినట్టుగా వ్యాఖ్యానించారు. ఒకరకంగా ఒక రాష్ట్రంలో న్యాయవ్యవస్థ పనితీరును శాసన వ్యవస్థ శంకిస్తూ ఉంది. న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం పోయిందని ప్రజల నుంచి ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి లోక్ సభలో వ్యాఖ్యానించారు. జడ్జిలు తమ వ్యక్తిగత స్వార్థాల మేరకు, వ్యక్తిగత ఇష్టాలు, ప్రయోజనాల మేరకు తీర్పులు ఇస్తున్నారంటూ సాక్షాత్తు ఎంపీలు భారత అత్యున్నత చట్టసభల్లో వ్యాఖ్యానించారు. 'న్యాయమూర్తుల ఎంపికలో న్యాయమైన చర్చ జరగాలి. ఈ తీర్పులు సక్రమంగా లేవు. న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ మధ్య పలుచని రేఖ ఉంది. న్యాయ వ్యవస్థ శాసన వ్యవస్థ అధికారాల్లోకి చొరబడరాదు. దేశం ప్రగతి మార్గాన పయనించాలంటే మొత్తం కొలీజియం వ్యవస్థనే తొలగించాలి. దీనిపై పునరాలోచించాలి...' అని మిథున్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ప్రధాన మంత్రి మా రాష్ట్రానికి వచ్చినప్పుడు మాజీ ముఖ్యమంత్రి అమరావతిని ఒక కుంభకోణంగా మార్చారని అన్నారు. అవినీతికి ఏటీఎంలాగా మార్చారని వ్యాఖ్యానించారు. అమరావతి భూ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు జరగాలని మిథున్ రెడ్డి వ్యాఖ్యానించారు.

మరి ఈ ప్రశ్నలకు ఎవరు సమాధానం ఇస్తారనేది పక్కన పెడితే, ఏపీ హైకోర్టు వరస తీర్పులపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తన అభిప్రాయాన్ని సూటిగా సుత్తి లేకుండా చెప్పింది. తదనంతర పరిణామాలు ఎలా ఉన్నా.. ప్రజల్లో ఈ అంశంపై కూలంకషమైన చర్చ అయితే జరుగుతూ ఉంది.

## బీజేపీ ఆధ్వర్యంలో హైస్కూల్‌లో స్వచ్ఛ భారత్



**రాజంపేట, వార్తవళి, సెప్టెంబర్ 19:** నరేంద్రమోడీ 70వ జన్మదినం సందర్భంగా "సేవా సప్తాహం-2020 పేరుతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆరవరోజు కడప జిల్లా మన్నూరు హైస్కూల్ లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్లాస్టిక్ వాడకం మరియు నిషేధంపైనా ప్రతిజ్ఞ చేశారు .ఈ కార్యక్రమంలో బిజెపి రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ పోతుగుంట రమేష్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వై .సురేష్ రాజు, ఓ బి సి మోర్చ రాష్ట్ర కార్యదర్శి పట్టుపోగుల ఆదినారాయణ, మండల అధ్యక్షురాలు ప్రభావతి,మండల ప్రధాన కార్యదర్శి రాము, మండల ఉపాధ్యక్షులు నరసింహ రాజు ,రేణు ప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు పి. పాపయ్యా, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మహిళా నాయకురాలు సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ రాజీవ్ శర్మ అరెస్ట్



ప్రముఖ జర్నలిస్టు... రచయిత విశ్లేషకుడు అయిన రాజీవ్ శర్మను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అరెస్ట్ చేయడం సంచలనమైంది. ఈనెల 14న ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కాగా రాజీవ్ శర్మ వద్ద రక్షణకు సంబంధించిన పత్రాలు లభించాయని పోలీసులు అభియోగాలు మోపారు. ప్రస్తుతం కేసు విచారణ సాగుతోందని.. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు. ద ట్రిబ్యూన్ సాకాల్ టైమ్స్ యూనైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా అనే వార్త సంస్థల్లో రాజీవ్ శర్మ పనిచేశారు. ఇటీవల చైనాకు చెందిన 'గ్లోబల్ టైమ్స్ లో కూడా ఒక ఆర్టికల్ రాశాడు. రక్షణ కు సంబంధించిన విషయంలో పలు పత్రాలు చేరవేశారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే 14న అరెస్ట్ చేసి.. 15వ తేదీన శర్మను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా.. ఆరురోజుల కస్టడీకి కోర్టు ఇచ్చింది. దీంతో రక్షణ పత్రాలకు సంబంధించి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. రాజీవ్ శర్మకు 'రాజీవ్ కిష్కింధ' పేరుతో ఒక యూట్యూబ్ చానెల్ ఉంది. శర్మ అరెస్ట్ అయ్యేరోజు తన చానెల్ లో రెండు వీడియోలు అప్ లోడ్ చేశారు. అందులో చైనా ఇప్పటికీ అల్లర్లు చేయవచ్చు అని పేర్కొన్నారు. ఇంకో వీడియోలో దేశంలో మీడియా వాచ్ డాగ్ లా ఉండాలని.. లాప్ డాగ్ లా మారిందని విమర్శిచాడు.ఈ క్రమంలోనే ఆయన అరెస్ట్ దేశ జర్నలిస్టు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## చంద్రబాబుకు సీబీఐ విచారణ కోరాలి: ఎమ్మెల్యే రోజా



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19 :** అమరావతిలో రాజధాని పేరుతో జరిగిన భూకుంభకోణంపై ఏసీబీ కేసు నమోదు చేయడంతో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన బినామిలు గజగజ వణుకుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే రోజా విమర్శించారు. అమరా వతిలో భారీ భూకుంభకోణం జరిగిందని... చంద్రబాబు,ఆయన బినామీలు అక్కడ వేల ఎకరాలు కొనుగోలు చేశారని ఆరోపించారు.

**హైకోర్టు ఆర్డర్ బాధాకరమన్న రోజా...**

భూకుంభకోణం కేసులో ఓ న్యాయవాదిపై కేసు నమోదు చేస్తే హైకోర్టు గ్యాగ్ ఆర్డర్ ఇవ్వడం బాధాకరమన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరిగిందని... ఎంతోమంది మేదావులు హైకోర్టు తీర్పుపై విస్మయం వ్యక్తం చేశారని అన్నారు. అమరావతిలో భారీ కుంభకోణం జరిగిందని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారని పేర్కొన్నారు. అప్పట్లో పోలవరం ప్రాజెక్టును ఏటీఎం తరహాలో వాడుకున్నారని ప్రధాని అన్నారని గుర్తుచేశారు.

**దమ్ముంటే సీబీఐ విచారణకు...**

ఏసీబీ అన్ని ఆధారాలతోనే కేసు నమోదు చేసిందని రోజా అన్నారు. చంద్రబాబు తేలుకుట్టిన దొంగలా వ్యవహరిస్తున్నారని... ఆయనకు దమ్ముంటే అమరావతి భూ కుంభకోణం, ఫైబర్ గ్రిడ్ అక్రమాల మీద సీబీఐ విచారణ కోరాలని సవాల్ విసిరారు. అంతర్వేదిలో రథం తగలబడిన ఘటనలో ప్రభుత్వ తప్పు లేకపోయినా సీఎం జగన్ సీబీఐ విచారణకు ఆదేశించారని చెప్పారు. అప్పట్లో వైఎస్ సైతం తన కొడుకు తప్పు చేసి ఉంటే అసెంబ్లీ సాక్షిగా ఉరితీయాలని చెప్పారని గుర్తుచేశారు. చంద్రబాబు స్టేలపై ఆధారపడి బతికే వ్యక్తి అని,కోర్టులు కూడా అందరికీ ఒకేలా న్యాయం జరిగేలా చూడాలని రోజా విజ్ఞప్తి చేశారు.

## వ్యాక్సిన్ తయారీ తేలికే, నమ్మకాన్ని పొందడమే కష్టం!




ఒకవైపు అత్యవసరమైన వ్యక్తులకు రష్యా రూపొందించిన కరోనా విరుగుడు వ్యాక్సిన్ స్పూత్నిక్ ను వేసే విషయమై ఆలోచిస్తున్నట్టుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ వ్యాక్సిన్ విషయంలో ఒకింత ఆందోళనకరమైన ఫలితాలు చర్చలోకి వస్తున్నా యి. ఆ వ్యాక్సిన్ వేయించుకున్న వారిలో సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉన్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వ్యాక్సిన్ వేయించుకున్న ప్రతి ఏడు మందిలోనూ ఒకరికి కొన్ని రకాల సైడ్ ఎఫెక్ట్స్ ను నోట్ చేస్తున్నారట పరిశోధకులు. ప్రధానంగా నిస్సత్తువ, తీవ్రమైన జ్వరం, కండరాల నొప్పులు వంటి ఫలితాలను గమనించినట్టుగా వార్తలు వస్తున్నాయి. సాధారణంగా కూడా కొన్ని రకాల వ్యాక్సిన్ ల వల్ల జ్వరం వస్తుంది. చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ ఇచ్చినప్పుడు కూడా డాక్టర్లు ఈ విషయాలు చెబుతారు. నెల వారీగా కొన్ని వ్యాక్సిన్ లు వేసినప్పుడు కాస్త జ్వరం వస్తుందని ఆందోళన చెందనక్కర్లేదని, చెబుతూ డోలోను ప్రిస్క్రైబ్ చేస్తుంటారు చిన్న పిల్లల వైద్యులు. పిల్లలకు వేసే అన్ని రకాల వ్యాక్సిన్ లకూ జ్వరాలు రావు. కొన్ని వ్యాక్సిన్ ల విషయంలోనే ఆ సైడ్ ఎఫెక్ట్ ఉంటుంది. అయితే ఆ జ్వరం స్వల్పమైన స్థాయిలోనే, డోలోతో తగ్గిపోయే రీతిలో ఉంటుంది, కాబట్టే ఆ వ్యాక్సిన్ లు చాలా కాలంగా వినియోగంలో ఉన్నాయి. కరోనా వ్యాక్సిన్ విషయంలో కూడా పలు పరిశోధన సంస్థలు జ్వరం వస్తుందని చెబుతున్నాయి. అది తక్కువ స్థాయిలోనే అని, తగ్గిపోతోందని చెబుతున్నాయి. అయితే అంతకు మించి సైడ్ ఎపెక్ట్స్ నోట్ చేస్తున్నారట రష్యన్ వ్యాక్సిన్ ప్రయోగాల్లో. ఇవి కూడా స్వల్పమైనవే, పెద్ద ఆందోళన చెందనక్కర్లేదేమో. ఇప్పటికే వినియోగంలో ఉన్న రకరకాల వ్యాక్సిన్ లతోనూ చిన్నపాటి సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నా.. వాటిపై విస్తృతమైన పరిశోధనలు జరిగాయి. చాలా టైమ్ తీసుకుని వాటిని అభివృద్ధి చేశారు. కాబట్టితో వాటితో ఉన్న సైడ్ ఎఫెక్ట్స్ పై వైద్యులకూ స్పష్టమైన అవగాహన ఉంది. కరోనా విరుగుడు వ్యాక్సిన్ లతో సైడ్ ఎఫెక్ట్స్ స్వల్పమైనవే అయినా.. ఈ వ్యాక్సిన్ ల విషయంలో విస్తృతమైన పరిశోధనలు లేకపోవడం, త్వరత్వరగా ఈ వ్యాక్సిన్ ల ప్రయోగాలు సాగించేస్తూ ఉండటంతో.. చిన్న పాటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా పెద్దవి గా కనిపిస్తున్నాయి. వ్యాక్సిన్ తయారు చేయడం తేలిక కాదు అని కొంతమంది పరిశోధకులు మొదటి నుంచి చెబుతున్న విషయం సామాన్య ప్రజలకు కూడా ఇప్పుడిప్పుడు అవగాహనలోకి వస్తోంది. వ్యాక్సిన్ తయారు చేయడం పరిశోధన సంస్థలకు పెద్ద కష్టం కాకపోవచ్చు.. దానిపై నియంత్రణ సంస్థల్లోనూ, ప్రజల్లోనూ నమ్మకాన్ని పెంపొందించడానికి మాత్రం చాలా సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## దేశంలో రోజుకు లక్ష కేసులు..

క్యాలెండర్లో తేదీలు మారుతున్నాయి. కరోనా వ్యాక్సిన్ మీద ప్రకటనలు అయితే వస్తున్నాయే కానీ.. పరిష్కార మార్గం లభించని పరిస్థితి. ఇదిలా ఉంటే.. అంతకంతకూ విస్తరిస్తున్న కేసులతో దేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మొదట్లో రోజుకు పది వేల కేసులు నమోదుకు వారాల తరబడి సమయం తీసుకున్నది కాస్తా.. ఇప్పుడు అందుకు భిన్నంగా రోజుకు 95వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. వైరస్ విస్తరిస్తున్న తీరు.. కేసులు నమోదువుతున్న వేగాన్ని చూస్తే.. రోజులో లక్ష కేసులు నమోదయ్యే రోజు దగ్గర్లోనే ఉందన్న అంచనా వినిపిస్తోంది. ఇప్పుడున్న జోరు ఇదే తీరులో కొనసాగితే కనిష్ఠంగా వారంలో గరిష్ఠంగా పన్నెండు రోజుల్లో రోజులో లక్ష కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. కేసుల నమోదు భారీగా పెరుగుతున్న ఆందోళన కొనసాగుతుంటే.. మరోవైపు ఊరట కూడా అదే స్థాయిలో ఉందని చెప్పక తప్పదు. ఎందుకంటే.. రికవరీ రేటు కూడా భారీగా ఉండటమే కారణం. శుక్రవారం సంగతే చూసుకుంటే.. దేశ వ్యాప్తంగా కొత్త కేసులు 96 వేలు నమోదైతే.. రికవరీ 87వేలకు పైనే కావటం గమనార్హం. ఇక.. టెస్టులు కూడా భారీగా పెంచేశారు. ఇప్పుడు రోజుకు 11 లక్షల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొత్త కేసుల నమోదు విషయాన్ని చూస్తే.. మొత్తం కేసుల్లో దాదాపు 70 శాతానికి పైగా కేసులు కేవలం ఏడు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం.

## ఢిల్లీలో కరోనా సామూహిక వ్యాప్తి...?



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో కరోనా వైరస్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నగరంలో కమ్యూనిటీ స్ప్రెడ్ జరుగుతోందా అని అనుమానం వ్యక్తం చేశారు. కానీ దీనిని కేంద్ర ప్రభుత్వం/ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ప్రకటించాల్సి ఉంది అని పేర్కొన్నారు. ఢిల్లీ లాంటి మహానగరంలో జన సమూహం అధికంగానే ఉంటారు. అయితే ఈ విషయాన్ని ఐసీఎంఆర్ ధృవీకరించాల్సి ఉంటుంది. అయితే గత 40 రోజుల్లో కరోనా వైరస్ కేసుల శాతం రెట్టింపు అవడంతో సత్యేంద్ర జైన్ అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో శుక్రవారం 4 వేల 127 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు వచ్చాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 2 లక్షల 38 వేలకు చేరింది. అలాగే మృతుల సంఖ్య కూడా 4 వేల 907కి చేరింది. మరోవైపు బుధవారం అత్యధికంగా 4 వేల 473 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు వచ్చాయి. ఆ రోజు వైరస్ సోకి 33 మరి చనిపోయారు. అంతకుముందు ఈ నెల 12వ తేదీన 4 వేల 321 వైరస్ కేసులు అత్యధిక రికార్డు ఉంది. కరోనా వైరస్ కేసులు పెరగడంతో కంటోన్మెంట్ జోన్ల సంఖ్యను కూడా పెంచుతున్నారు. 1670 ఉన్న కంటోన్మెంట్ జోన్లను 1751కి పెంచారు. అలాగే పాజిటివ్ కేసుల సంఖ్య 6.76 నుంచి 7.38కి పెరిగింది. అలాగే వైరస్ వచ్చి తగ్గినవారి సంఖ్య కూడా 84.44కి చేరింది. అయితే మృతుల సంఖ్య 2.05 శాతానికి చేరింది.



# విశాఖపట్నం వార్తలు

## స్విమ్మింగ్ పూల్‌లో యువకుని మృతదేహం

### చంపేశారు అంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ

**గాజువాక, వార్తావళి, సెప్టెంబర్ 19:** విశాఖ జిల్లా లోని ఓ ప్రైవేటు రిసార్ట్లో బర్త్ డే పార్టీలో పాల్గొన్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పార్టీలో పాల్గొన్న ఈ యువకుడి మృతదేహం స్విమ్మింగ్పూల్లో కనిపించడంతో స్నేహితుల చంపేశారు అంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గాజువాక చెందిన సుధాకర్ అనే యువకుడు పుట్టినరోజు సందర్భంగా నిన్న అచ్యుతాపురం మండలం కొండకర్ల వద్ద ఓ ప్రైవేట్ రిసార్ట్లో బర్త్డే పార్టీ ఏర్పాటు చేశారు. సుధాకర్ కి చెందిన మొత్తం 10 మంది స్నేహితులు ఈ పార్టీలో పాల్గొన్నారు. వీరిలో గాజువాక బి.సి కాలనీకి చెందిన సాయి అనే యువకుడు స్విమ్మింగ్ పూల్ లో పడి చనిపోయాడని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పదోతరగతి చదువుతున్న ఈ సాయి తల్లిదండ్రులు మరణించడంతో బంధువుల ఇంట్లో ఉంటూ న్నారు. ఈ దశలో స్విమ్మింగ్పూల్లో సాయి మృతదేహం కనిపించడంతో అతని చిన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు తోటి స్నేహితులు చంపేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# వైసిపిలోకి వాసుపల్లి

**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 19:** వాసుపల్లి గణేష్ కుమార్, టీడీపీ ఎమ్మెల్యే వైస్సార్సీపీలో జాయిన్ కావడం ఆనందంగా ఉంది. నా కుమారులు కూడా చేరారు. గట్స్ ఉన్న నాయకుడిగా జగన్ కనిపించారు. ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతుంది ఆయన ధైర్యమే అనేక సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అందరికీ చేరుతున్నాయి. టీడీపీ ఇక ముందుకువస్తోందని నాకు అనిపించడం లేదు. విశాఖ ఏక్సిక్యూటివ్ కాపిటల్ ఇచ్చిన ఘనత ఆయనిది అనేక పనులు నా నియోజకవర్గంలో ఉన్నాయి...అవన్నీ జగన్ గారి వల్లే సాధ్యం. మేయర్ ఎన్నికల్లో విజయం సాధించి జగన్ గారికి గిఫ్ట్ ఇస్తాం వల్లభనేని వంశీ, ఎమ్మెల్యే, గన్నవరం సీఎం గారు నాయకత్వంలో పని చేస్తానని చెప్పారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి జరుగుతోంది. సీఎం గారి వెనుకుండి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మేమంతా కృషి చేస్తాం. విజయ సాయి రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వాసుపల్లి గణేష్ గారి కుటుంబం విశాఖ ప్రజల కోసం చేస్తున్న సేవలు హర్షణీయం. ఆయన కుమారులు, మొత్తం కుటుంబం చాలా విద్యావంతమైన కుటుంబం. సమాజానికి సేవ చేయాలనే ఆయన ఉద్దేశ్యం మంచిది. జగన్ గారు వారి కుమారులకు కండువా వేశారు. వారు పార్టీలోకి రావడం కొండతా బలాన్ని ఇస్తోంది. టీడీపీలో ఈ రోజు విశాఖలో తుడుచుపెట్టుకు పోతుందండంలో సందేహం లేదు. సీఎం చేస్తున్న అభువృద్ధిని గమనించి టీడీపీలో విద్యావంతులు వైఎస్సార్సీపీ లోకి వస్తున్నారు. భవిష్యత్తులో మరింతగా చూస్తారు. చంద్రబాబుకు ప్రతిపక్షంలో ఉన్నా లేకున్నా పెద్ద తేడా ఉండదు. అసలు ప్రతిపక్షం ఉంటే కదా ప్రతిపక్ష నాయకుడు ఉండేది. అసలు ప్రతిపక్షమే ఉండదు.

## గ్రామ సచివాలయ ఉద్యోగుల పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 19 :** స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే గ్రామ సచివాలయ రాత పరీక్షకు సంబంధించి అధికారుల అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే పరీక్ష నిర్వాహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జెరాక్స్ షాపులు తియ్యరాదని స్థానిక ఎస్ఐ పి రామారావు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అదే విధంగా పరీక్షకు వచ్చే అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలపై స్థానిక ఎంపీడీవో పోలినాయుడు పంచాయతీ కార్యదర్శులకు సూచనలు జారీ చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఈ పరీక్షలు జరిపించాలని ఆయన పేర్కొన్నారు.

## లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలేవి

**మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 19 :** కనీసం పద్దెనిమిది ఏళ్ళు నిండని కుర్రాళ్ళు మోటర్ బైకులు నడుపుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమకు అడిగేవారెవరున్నారన్న ధిమాతో మోటర్ బైక్ యజమానులు 18 ఏళ్ళు నిండని వారికి వాహనాలు ఇవ్వడంతో, వారు రెచ్చిపోయి మితిమీరిని వేగంతో వాహనాలు నడుపుతున్నారు. ప్రధాన దారుల్లోనే కాకుండా, వీదుల్లో కూడా రేస్ బైకులవలే స్పీడుగా నడుపుతున్న పరిస్థితుల్లో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. వయసు నిండని కొంతమంది యువకులు నడుపుతున్నా వాహనాలను అధికారులు పరిశీలించి, వారికి వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రూ.100 ట్రిలియన్ మార్క్ దాటిన కేంద్ర ప్రభుత్వపు రుణం




**ఢిల్లీ:** మొట్టమొదటి సారిగా కేంద్ర ప్రభుత్వపు రుణం రూ.100 ట్రిలియన్ మార్క్‌ను దాటిపోయింది. అంటే రూ.100 లక్షల కోట్లు పైకి చేరింది. ఇదిక కూడా జూన్ నెల చివరి నాటికి. అంటే ఇప్పటికీ ఇంకా 3 నెలలు దాటిపోయింది. అంటే రుణం మరింత పెరిగి ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ త్రైమాసిక నివేదికలో ఈ విషయం వెల్లడైంది.ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం చూస్తే.. మోదీ సర్కార్ రుణం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (2020 ఏప్రిల్–జూన్) అప్పు ఏకంగా రూ.7 లక్షల కోట్లు పెరిగింది. ఈ స్థాయిలో అప్పు పెరగడం గమనార్హం. దీంతో కేంద్రం రుణ భారం రూ.101.3 లక్షల కోట్ల మార్క్‌ను దాటిపోయింది.

## చిన్నారులకు టిషర్ట్స్ పంపిణీ

**అరకు, వార్తావళి, సెప్టెంబర్ 19 :** అల్లూరి విజయవాణి మరియు ప్రసాద్ వారి ఆర్థిక సహాయంతో అరకులోయ మండలం చొంపి గ్రామంలో ఎచ్.ఆర్.ఏ.సి.ఏ జిల్లా మహిళ అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఏభై మంది చిన్నారులకు టి షర్ట్స్ పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఆమెను చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



27వ వార్డు దొండపర్తి గ్రామ దేవత అయిన శ్రీ ఏరుకుమాంబ ఆలయంలో మన అందరి ప్రియతమ నాయకులు శ్రీ ద్రోణంరాజు శ్రీనివాస్ గారు ఆరోగ్యం బాగు అవ్వాలి అని ప్రత్యేక పూజలు జరిపించడం జరిగింది.
**–అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**



35వ వార్డులో వైయస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ అయినా శుభ సందర్భంగా వార్డులో వారం రోజులు వారోత్సవాలు ఘన విజయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వ వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి.అలుపన కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ ఘన విజయానికి సహకరించిన వార్డు సి.డి.వొకి అలుపన కనకరెడ్డి గౌరవంగా సన్మానం చేసి స్వీట్ అందచేయడం జరిగింది. అలానే ఈ కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించిన ఆర్ పి లను, అక్కా చెల్లెమ్మలుగా భావించి వాళ్లకి పసుపు కుంకుమ భరణి, చీరా జాకెట్, మాస్క్, శానిటైజర్, స్వీట్స్ ఇచ్చి వాళ్లని కనక రెడ్డి గౌరవంగా శాలువతో సన్మానించి సత్కరించారు.
**–అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**

## మినీ ఆన్‌లైన్ షాప్‌తో ఆన్‌లైన్‌కు మారిపోండి




మినీ ఇండియా మినీ ఆన్‌లైన్ షాప్‌ను పరిచయం చేసింది. వినియోగదారులు ఆన్‌లైన్ నుంచి ఆన్–రోడ్‌కు తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు shop.mini.in భేటీ కావడం ద్వారా ప్రారంభించవచ్చు, ఇది వారి ప్రతి ఒక మినీ కు కేంద్రంగా ఉంటుంది. వారు పూర్తి మినీ రేంజ్‌ను ఆవిష్కరించుకోవచ్చు, తమ ఎంపికల మినీ ను కాన్ఫిగర్ చేసుకోవచ్చు, సమీపంలోని మినీడీలర్ వివరాలు తెలుసుకోవచ్చు, టెస్ట్ డ్రైవ్ లేదా కొటేషన్ కోరవచ్చు, మినీ లెక్క వేసుకోవచ్చు అంతే కాకుండా ఒక మీటను క్లిక్ చేయడం ద్వారా తమ మినీబుక్ చేసుకోవచ్చు. మినీ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పావాహ్ మాట్లాడుతూ, "స్వభావసిద్ధంగా సృజనశీలత మరియు ఆశావాదంతో నిండి ఉండే మినీ సదా ఏదో ఒక కొత్తదాన్ని అందిస్తుంది. డిజిటలైజేషన్ మన ప్రపంచాన్ని మార్చివేస్తుంది మరియు ఇప్పుడు మొత్తం మీద వినియోగదారుని ప్రయాణంలో అవిభాజ్య అంగంగా మారిపోయింది. ప్రగతిశీలక బ్రాండ్‌గా మినీ నిరంతరం తన వినియోగదారులు మరియు తన అభిమానులు క్రియాశీలకంగా ఉండేందుకు తనను తాను విభిన్నంగా మార్చుకుంది. భారతదేశంలో మినీ ఆన్‌లైన్ షాప్ ప్రారంభంతో మేము దేశ వ్యాప్తంగా మా అడుగుజాడలను విస్తరించుకునేందుకు అవకాశాలను మెరుగుపరచుకోగా, ఇది నూతన వినియోగదారులకు మినీ వారి ప్రయాణాన్ని ఎక్కువ సురక్షితం మరియు సులభం చేసుకోవడాన్ని సాధ్యం చేస్తుందని" పేర్కొన్నారు.

## "ఆప్కో" దసరా దీపావళి పండుగ ఆఫర్



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 19:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ "ఆప్కో" దసరా దీపావళి పండుగ సందర్భంలో ఎంపిక చేసిన వస్త్రాలపై ఒకటి కొంటే ఒకటి ఉచితం 1o1 మెగా ఆఫర్ , ఒకటి కొంటే రెండు ఉచితం 1/2 బంపర్ ఆఫర్ మరియు అన్నిరకాల వస్త్రాలపై 30% ప్రత్యేక తగ్గింపు ఇస్తుందని వైజాగ్ డివిజినల్ మార్కెటింగ్ అధికారి టి జగదీశ్వరరావు వైజాగ్ డివిజన్ మెయిన్ బ్రాంచ్ సిరిపురం మేనేజర్ బి విశ్వేశ్వరరావు తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని రకాల చేనేత ఉత్పత్తులు అనగా ధర్మవరం మాధవరం వెంకటగిరి మంగళగిరి బందరు గుంటూరు రాజమండ్రి ఉప్పాడ పట్టు కాటన్ చీరలు దోవతులు దుప్పట్లు లుంగీలు రుమాళ్ళు షర్టింగ్ డ్రస్ మెటీరియల్ మొదలైనవి అన్ని ఆప్కో విక్రయ శాలలలో లభించునని చేనేత వస్త్రములు విరివిగా కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రొత్సహించవలసినదిగా కోరారు. వివరాలకు 8008364957, 0891–2563503 సంప్రదించాలన్నారు.

## సైబర్ సెక్యూరిటీలో అగ్రస్థానంలో అమెరికా

సైబర్ మోసం .. ప్రపంచంలో ఎక్కువుగా వినిపించే పేరు. సామాన్యుల నుండి ప్రముఖుల వరకు ప్రతి ఒక్కరు కూడా సైబర్ మోసగాళ్ల చేతుల్లో చిక్కి మోసపోతున్నారు. పోలీసులు ఈ తరహా మోసగాళ్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నప్పటికీ కూడా రోజుకో కొత్త పంథాను ఎంచుకొని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మధ్య కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలుకుని ఇండియా ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాలు హ్యాక్ అయిన విషయం తెలిసిందే. భవిష్యత్ లో 'ఫేస్ టు ఫేస్' యుద్ధాలు ఉండవని.. సైబర్ దాడులే ఎవరి శక్తి ఎంతని నిర్ణయిస్తాయని రక్షణ రంగ నిపుణులు ఇప్పటికే హెచ్చరిస్తున్నారు. ఇక మన పొరుగు దేశం చైనా సైబర్ వింగ్ కోసం ప్రత్యేకంగా నియామకాలు చేపట్టిందని కథనాలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సైబర్ సామర్థ్యాల వియయంలో ఏ దేశం సత్తా ఎంత ఉందనే దానిపై 'హార్వర్డ్ కెనెడీ స్కూల్ కు చెందిన బెల్ ఫేర్ సెంటర్ ఫైర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ సర్వే చేసి ఆ వివరాలు ప్రకటించింది. ఆ సర్వే .. టాప్ 10లో అమెరికా నెంబర్ వన్ కాగా .. చైనా ఇంగ్లాడ్ రష్యా నెదర్లాండ్స్ ఫ్రాన్స్ జర్మనీ కెనడా జపాన్ ఆస్ట్రేలియా దేశాలు కొనసాగుతున్నాయి. ఇండియా సైబర్ సెక్యూరిటీ సామర్థ్యం లో 21 స్థానంలో నిలిచింది. అయితే భారత సైబర్ భద్రతా వ్యూహం కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్న సమయంలో తాజాగా విడుదలైన నివేదిక అందుకు మార్గం సుగమం చేస్తుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి.



విశాఖ–దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త,మాజీ శాసనసభ్యులు,మాజీ (విఎంఆర్‌డిఎ)చైర్మన్ గారు గౌరవనీయులు శ్రీ .ద్రోణంరాజుశ్రీనివాస్ గారు త్వరగా కోలుకోవాలని 34వ.డివిజన్ అధ్యక్షులు శ్రీమతి. తోట.పద్మావతి గారు,పార్టీ శ్రేణులు,కెప్టెన్.రామారావు జంక్షన్ వద్ద కొలువుతీరిన శ్రీ.శ్రీ.శ్రీ.రేణుకాఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించినారు,పై కార్యక్రమంలో వై.సి.పి.సీనియర్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.
**–అర్జా రాజేష్, వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**

## ప్రైవేటు రైళ్ల టికెట్ ధరలపై షాకిచ్చేలా మోడీ సర్కార్ నిర్ణయం?



ఇప్పటివరకు అలవాటైన రూల్స్ అన్ని మారనున్నాయి. వ్యాపారం ఏదైనా కావొచ్చు.. ప్రభుత్వ నియంత్రణ ఉంటే ఒకలా.. అదేమీ లేకుండా తమకు తోచినట్లుగా బాదేసే తీరు అన్ని వ్యాపార సంస్థల్లోనూ కనిపిస్తుంటుంది. తాజాగా అలాంటి పరిస్థితికే పచ్చజెండా ఊపేసింది మోడీ సర్కారు. దేశ వ్యాప్తంగా వంద రూట్లలో ప్రైవేటు రైళ్లకు ఓకే చెప్పేస్తూ మోడీ సర్కారు నిర్ణయం తీసుకోవటం తెలిసిందే. ప్రైవేటు రైళ్లలో టికెట్ ధరలు ఎలా ఉంటాయన్న దానిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రైవేటు రైళ్ల టికెట్ ధరలపై ప్రభుత్వం మార్గదర్శకాలు విధించాలన్న డిమాండ్ ఉంది. అందుకు భిన్నంగా మోడీ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. తాజాగా రైల్వే బోర్డు ఛైర్మన్ వీకే యాదవ్ ప్రైవేట్ రైళ్ల టికెట్ ధరలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రైవేటు రైళ్లను నిర్వహించే ఆపరేటర్లు.. తమ రైళ్లలో టికెట్ ధరల్ని వారికి తోచినట్లుగా నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను కల్పించినట్లుగా యాదవ్ తాజాగా వెల్లడించారు. దీంతో.. టికెట్ల ధరలు ఎక్కువగా ఉంటాయన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం అంత స్వేచ్ఛ ఇవ్వాల్సిన అవసరం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే.. రైల్వేలలో ప్రైవేటు పెట్టుబడుల్ని భారీగా ఆకర్షించాలంటే ఈ మాత్రం స్వేచ్ఛ ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. టికెట్ ధరలు ఎంత ఉండాలన్న విషయంపై ప్రైవేటు సంస్థలకే స్వేచ్ఛ ఇవ్వటం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రాబ్లం ఉండదన్న మాట వీకే యాదవ్ చెబుతున్నారు. ఎందుకంటే.. ఆయా రూట్లలో ఏసీ బస్సులు.. విమానాలు కూడా తిరుగుతుంటాయని.. ప్రైవేటు రైళ్లు తమకు తోచినట్లుగా ధరల్ని నిర్ణయిస్తే.. ప్రజల ఆదరణ ఉండదన్నది ఆయన వాదన. వినేందుకు బాగానే ఉన్నా.. డిమాండ్ భారీగా ఉన్నప్పుడు పెద్ద ఎత్తున టికెట్ల ధరల్ని పెంచేసి బాదేసే తీరు ఇప్పటికే చూస్తున్నదే. మోడీ సర్కారు ఇచ్చిన స్వేచ్ఛ కారణంగా టికెట్ల ధరలు సామాన్యులకు.. మధ్య తరగతి వారికి భారంగా మారటం ఖాయమన్న మాట బలంగా వినిపిస్తోంది.

## డ్రీమ్11 ఐపిఎల్ 2020లో 6 జట్లకు అధికారిక స్మైల్ పార్ట్‌నర్‌గా కోల్గేట్




భారతదేశంలో అత్యంత పెద్ద ఉత్సవం ప్రారంభమవుతున్న సమయంలో ఆశావాదాన్ని నింపడమే కాకుండా నవ్వులను విస్తరించనుంది! నోటి ఆరోగ్య సంరక్షణలో ముందంజలో ఉన్న కోల్గేట్ –పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ భారతదేశాన్ని చిరునవ్వుతో ఉంచే తన ప్రయత్నంలో రానున్న డ్రీమ్ 11 ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2020లో 6 జట్లకు అధికారిక స్మైల్ పార్టనర్‌గా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ జట్లలో ఢిల్లీ క్యాపిటల్స్, కింగ్స్ పంజాబ్, కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబయి ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉన్నాయి. కోల్గేట్ స్మైల్ ఐకాన్ టోర్నమెంట్ కొనసాగినన్ని రోజులు పలు టచ్ పాయింట్లలో కనిపించనుంది. డ్రీమ్ 11 ఐపీఎల్ 2020లో ఈ సీజన్ అన్ని అడ్డంకులను అధిగమించి, వినూత్నంగా నిర్వహిస్తుండగా, దేశంలో సకారాత్మకత మరియు ఆశావాదాన్ని ప్రతిబింబించే గమనార్హమైన ప్రదర్శన కానుండగా, కోల్గేట్ 'స్మైల్ కరో ఔర్ షురూ హో జావో (నవ్వుతో ప్రారంభించండి) అనే సిద్ధాంతానికి అనుగుణంగా ఉంది. తమ భాగస్వామ్యం గురించి కోల్గేట్– పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ చింతామణి మాట్లాడుతూ "మహమ్మారితో అనిశ్చితి మరియు సమస్యలు నడుమే టి 20 క్రికెట్ క్రికెట్ సీజన్ ప్రారంభించడం దేశ వ్యాప్తంగా ఆశావాదపు అలలనే తీసుకు వచ్చింది. మేము కోల్గేట్‌లో 6 జట్లకు అధికారిక స్మైల్ పార్ట్‌నర్‌గా మా భాగస్వామ్యం పట్ల ఉత్సుకతతో ఉన్నాము మరియు ఈ భాగస్వామ్యాన్ని ప్రజలకు సకారాత్మకత శక్తి మరియు 'స్మైల్ కరో ఔర్ షురూ హో జావో' జ్ఞాపకం చేసేందుకు దీన్ని వినియోగించుకుంటామని" పేర్కొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలి

### సంయుక్త సంచాలకులు ఎం.వి.ఏ. నరశింహులు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 19:** గొర్రెలు, మేకల పెంపకందారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎం.వి.ఏ. నరశింహులు తెలిపారు. శనివారం గొర్రెలు, మేకల సంవర్ధన దినోత్సవం సందర్భంగా బలిజిపేట మండలం తుమరాడ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సదస్సు ఏర్పాటు చేయడమైనది. నూతనంగా గొర్రెల, మేకల సంఘం ఏర్పాటు చేయుట గురించి జెడి వివరించారు. వైఎస్ఆర్ పశు నష్ట పరిహార పథకంపై అవగాహన కల్పించారు. మందలోని విత్తన పొట్టేలు రెండు సంవత్సరాలకు ఒకసారి మార్చుకోవడం ద్వారా మందను లాభసాటిగా నడిపించవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై అవగాహన పర్చారు. గొర్రెలు, మేకలు పెంపకం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. బి. శ్రీనివాసరావు, పశు వైద్యులు డా. ఎస్. గోవర్ధన సాగర్, డా. గణేష్, డా. సతీష్, సిబ్బంది, 50 మంది గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006